E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 19-08-2025 (వారం) మంగళవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



ట్రాఫిక్ జాంలో చిక్కుకుంటే టోల్ ఎందుకు కట్టాలి

» 3లో



## బీసీలంటే బీజేపీకి ఏమాత్రం ఇష్టం లేదు

- 42శాతం కి కేసీఆర్ చట్టమే శాపం
- మొత్తం 50%మించకుండా చట్టంతో విగించారు
- మతం ముసుగులో రిజర్వేషన్లకు బీజేపీ మోకాలడ్డు
- 'ఓట్ల చోరీ'పై యుద్ధానికి బీసీల మద్దతు కావాలి: సీఎం
- సర్వాయి పాపన్న విగ్రహానికి రేవంత్ శంకుస్థాపన
- టీఫైబర్‌పై సమగ్ర నివేదిక ఇవ్వండి: ముఖ్యమంత్రి

హైదరాబాద్, ఈ కబురు: తమ ప్రభుత్వం బీసీలకు కల్పించాలనుకుంటున్న 42 శాతం రిజర్వేషన్లకు గతంలో కేసీఆర్ చేసిన చట్టమే శాపంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పకడ్బందీగా చట్టం చేశారని మండి పడ్డారు. మరోపక్క మతం ముసుగులో బీజేపీ నేతలు, బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు చట్టంలోనే లేవని, ఎందుకు అబద్ధాలతో బహుజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారని ప్రశ్నించారు. దూదేకుల, నూర్ బాషా, బార్బర్, దోబీ వృత్తి చేసే ముస్లింలకు 56 ఏళ్లుగా బీసీ రిజర్వేషన్లు అమలవుతున్నాయని గుర్తు చేశారు. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లో బీసీలలో ఉన్న ముస్లింలను రిజర్వేషన్ల నుంచి తొలగించగలరా? అని నిలదీశారు. సోమవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహరాజ్ 375వ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసి, రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. "గాంధీ కుటుంబం మాట ఇస్తే అది శిలా శాసనమే. గతంలో తెలంగాణ ఇస్తామని చెప్పారు మాట నిలబెట్టుకున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్‌గాంధీ మాట ఇచ్చారు. ఆయన సూచనల మేరకే కుల గణన సర్వే చేశాం. అందులో తప్పులుంటే చూపాలని సవాల్ విసిరాం. తప్పులు చూపితే క్షమాపణ చెబుతామన్నాం.

తరువాయి 2లో

# భారత్ నుంచి అమెరికాకు 7 రెట్లు పెరిగిన ఎగుమతులు

తరువాయి 2లో



- ట్రంప్ ప్రతీకార సుంకాల హెచ్చరికలే కారణం
- 7 రెట్ల మేర వృద్ధి.. ట్రంప్ ప్రతీకార సుంకాల వల్లే..
- వ్యాపారాన్ని పోగొట్టుకోకుండా ఉండేందుకు రాయితీలు కూడా ఇస్తున్న ఎగుమతిదారులు

ఈ కబురు, న్యూఢిల్లీ: ట్రంప్ ప్రతీకార సుంకాల హెచ్చరికల నేపథ్యంలో.. భారతీయ ఎగుమతిదారులు 'ఫ్రంట్‌లోడింగ్' పెంచారు! ఫ్రంట్‌లోడింగ్ అంటే.. సుంకాలు పెరుగుతాయని తెలిసినప్పుడు ముందే పెద్ద ఎత్తున ఎగుమతులను పెంచడం. ఎంతగా పెంచారంటే.. ఏప్రిల్‌జూలై నెలల మధ్య అమెరికాకు మన ఎగుమతులు ఏకంగా 21 శాతం పెరిగి 33.5 బిలియన్‌డాలర్లకు (రూ.2.92లక్షల కోట్లకు) చేరింది. ఇదే సమయంలో.. భారత్ నుంచి మొత్తం ఎగుమతులు కేవలం 3 శాతం మాత్రమే పెరిగి 149.2 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.13 లక్షల కోట్లకు) చేరాయి. అంటే.. మనదేశం నుంచి పెరిగిన మొత్తం ఎగుమతులతో (3%) పోలిస్తే.. అమెరికాకు (21%) ఏడు రెట్లు ఎక్కువ పెరిగాయని గణాంకాలను ఉటంకిస్తూ 'టైమ్స్ ఆఫ్ ఇండియా' వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. ఆ కథనం ప్రకారం... ఎగుమతులను భారీగా పెంచేయడం వల్ల.. కొనుగోలుదారులకు కొంతమేర రాయితీ ఇచ్చే అవకాశం పెరుగుతుంది. తద్వారా.. ఆగస్టు 27 నుంచి సుంకాలు 50 శాతానికి చేరినా, ఇప్పుడు ఇచ్చే రాయితీని కలుపుకొంటే అప్పుడు కొ



## భారతీయులందరికీ స్ఫూర్తి : ప్రధాని మోదీ

- శుభాంశు శుక్లాను అభినందించిన మోదీ

తరువాయి2లో



## ప్రధాని మోదీకి పుతిన్ ఫోన్



తరువాయి 3లో

## భారత్‌లో యాపిల్ రూ.1010 కోట్ల ఆఫీస్..

» 4లో



## సినిమాల్లో హీరో.. రియల్ లైఫ్ విలన్..

» 3లో



## 'గుంటూరు కారం' చేసేప్పుడు నీ ఫేస్ కొంచెం తేడా

» 5లో



## 17 ఏళ్ల కెరీర్.. విరాట్ సాధించిన

» 6లో





» 2లో

## రేవంత్ చేతకానితనం వల్లే పరిశ్రమలు పారిపోతున్నాయి: కేటీఆర్

# గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ!



- కృష్ణాలో ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు ప్రాజెక్టులన్నింటి గేట్లు ఎత్తివేత
- గోదావరిలోనూ సింగూరు నుంచి ధవళేశ్వరం వరకు ప్రాజెక్టులన్నింటి గేట్లు బార్లా
- సోమవారం తెరుచుకున్న నిజాంసాగర్, శ్రీరామ్‌సాగర్

ఈ కబురు, హైదరాబాద్: బిరబిరా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. గలగలా గోదావరి ఉరుకులు పరుగులు పెడుతోంది. కృష్ణా పరీవాహకంలో ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు.. గోదావరి పరీవాహకంలో సింగూరు నుంచి ధవళేశ్వరం బరాజ్ వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేయడంతో ఉభయ నదులు స్వేచ్ఛగా పరుగెడుతూ కడలిలో కలిసిపోతున్నాయి. కృష్ణా పరీవాహకంలో ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జూరాల ప్రాజెక్టులోకి 1.85 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.79 లక్షల క్యూసెక్కులను వదిలేస్తున్నారు. జూరాల, తుంగభద్ర నుంచి వస్తున్న వరదతో శ్రీశైలంకు ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. సోమవారం సాయంత్రం శ్రీశైలం జలాశయానికి 3.29 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 10 గేట్లను 12 అడుగుల మేర పైకెత్తి 4.03 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు విద్యుదుత్పత్తి ద్వారా మరో 66,099 క్యూసెక్కులను విడుదల చేస్తుండడంతో సాగర్‌లోకి 3.05

తరువాయి2లో

# ఓటు చోరీకి ఆయుధంగా ఎస్ఐఆర్



- బీజేపీ, ఈసీ కలిసి బడుగు వర్గాల ఓట్లను దొంగిలిస్తున్నాయి
- వారి ఉనికి లేకుండా చేస్తున్నాయి
- 'ఓటు చోరీ'పై పోరాటం సాగిస్తాం
- 'ఒక వ్యక్తి.. ఒక ఓటు'ను కాపాడతాం: రాహుల్ గాంధీ
- బిహార్‌లో రెండోరోజు ఓటరు అధికార యాత్రలో రాహుల్

ఔరంగాబాద్/గయా జీ ,ఈ కబురు: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) అనేది ఓట్లను దొంగిలించేందుకు వాడుతున్న ఆయుధమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఓట్ల చోరీని అడ్డుకొని 'ఒక వ్యక్తి.. ఒక ఓటు'ను పరిరక్షించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ మేరకు గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి.. ప్రస్తుత ఎస్ఐఆర్‌లో భాగంగా

తరువాయి 2లో



## తరువాయి.. త్రైపాక్షిక చర్చలు

» 3లో

## ముంబైలో కుండపోత

- భారీ వర్షాలతో నగరం అతలాకుతలం
- రైళ్లు, విమాన రాకపోకలకు అంతరాయం
- నాందేడ్ జిల్లాలో ఐదుగురు గల్లంతు



» 3లో

మొదటి పేజి తరువాయి

# భారత్ నుంచి అమెరికాకు 7 రెట్లు పెరిగిన ఎగుమతులు



తమ వ్యాపారాన్ని కోల్పోకుండా ఉండేందుకు.. పాత కొనుగోలుదారులకు అదనపు రాయితీలు కూడా ఇవ్వజూపుతున్నారు. ప్రస్తుతానికి పెంచిన (25%) సుంకాల దెబ్బ పూర్తిస్థాయిలో తమపై పడకుండా ఎగుమతిదారులు తీసుకుంటున్న ఈ చర్యలు తాత్కాలికమేనని.. సుంకాల భారం 50 శాతానికి పెరిగితే వారి వ్యాపారంపై తీవ్ర ప్రభావం పడుతుందని పరిశ్రమల నిపుణులు చెబుతున్నారు. కాగా, ఏప్రిల్‌జూలై నడుమ ఎగుమతులతో పోలిస్తే.. ఒక్క జూలై నెలలో భారత్ నుంచి ఎగుమతులు భారీగా పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఉదాహరణకు.. జెమ్స్ అండ్ జువెలరీ రంగంలో ఎగుమతులు జూలైలో 28రె మేర పెరిగాయి. ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులు.. ఏప్రిల్‌జూలై నడుమ 7.4రె పెరిగితే, ఒక్క జూలైలోనే 14రె మేర పెరిగాయి. ఇంజనీరింగ్ ఉత్పత్తులు ఏప్రిల్‌జూలై నడుమ 6రె పెరిగితే.. ఒక్క జూలైలోనే 13.8రె పెరిగాయి. ప్లాస్టిక్ ఉత్పత్తుల ఎగుమతులు జూలైలో 4.4రె మేర పెరిగాయి.

ఉక్రెయిన్‌కు రక్షణగా నిలుస్తామని.. శాంతి కోసం అవసరమైతే అమెరికా దళాలను పంపించడానికి సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. యూరప్ దేశాలు ముందు నిలుస్తాయని, తాము వీలైనంత సహాయం చేస్తామని చెప్పారు. యూరప్ దేశాలతో చర్చలు, సంప్రదింపుల తర్వాత దీనిపై స్పష్టత వస్తుందన్నారు. నిజానికి కాల్పుల విరమణ పాటించాలని తాను కోరానని, కానీ రష్యా అధ్యక్షుడు పుతిన్ అందుకు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. సోమవారం అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధంలో జెలెన్‌స్కీ, యూరప్ దేశాల నేతలతో జరిగిన చర్చల్లో ట్రంప్ ఈ వివరాలు వెల్లడించారు. ఈ చర్చల తర్వాత పుతిన్‌కు ఫోన్ చేసి మాట్లాడనున్నట్టు చెప్పారు. ఇక శాంతి ఒప్పందంలో భాగంగా తమ భద్రతకు అవసరమైన అన్ని రకాల సహాయం చేయాలని అమెరికా, యూరప్ దేశాలను జెలెన్‌స్కీ కోరారు. బలమైన సైన్యం, ఆయుధాలు, శిక్షణ, నిఘా వ్యవస్థలు ఉక్రెయిన్‌కు అవసరమని.. ఇదంతా అమెరికా, యూరప్ దేశాల చేతిలో ఉందని పేర్కొన్నారు. యూర్‌పలో ఒక్క దేశంలో శాంతికోసం చర్చించడమంటే.. మొత్తం యూరప్ శాంతి కోసమని జెలెన్‌స్కీ అభివర్ణించారు. తాము యుద్ధం నిలిపివేయడంపై దృష్టిపెడితే.. రష్యా దాడులు చేస్తూ, ప్రజల ప్రాణాలను బలితీసుకుంటోందని మండిపడ్డారు. ట్రంప్‌తో భేటీ కోసం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతోపాటు ఫ్రాన్స్, ఫిన్లాండ్ అధ్యక్షులు మేక్రాన్, అలెగ్జాండర్ స్టబ్, బ్రిటన్, ఇటలీ ప్రధానులు కీర్ స్టార్మర్, జార్జియా మెలోనీ, జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, నాటో జనరల్ సెక్రెటరీ మార్క్ రూట్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా లెయెన్ శ్వేతసౌధానికి వచ్చారు. ఒక దేశం విషయంలో ఇంత మంది ప్రపంచ నేతలు ఇలా తమ పనులన్నీ వదులుకుని వచ్చి భేటీకావడం అరుదైన ఘటన అని అమెరికా అధికారవర్గాలు పేర్కొన్నాయి.

**పతుల ద్వారా సతుల లేఖలు!**

ఉక్రెయిన్‌లో యుద్ధం ఆపాలంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ట్రంప్ సతీమణి మెలనియా లేఖ రాసిన సంగతి తెలిసిందే. అలాస్కాలో జరిగిన చర్చల సందర్భంగా ట్రంప్ స్వయంగా ఆ లేఖను పుతిన్‌కు అందజేశారు. తాజాగా చర్చల కోసం శ్వేతసౌధానికి వచ్చిన జెలెన్‌స్కీ.. ట్రంప్ సతీమణి మెలనియాకు తన సతీమణి ఒలెనా జెలెన్‌స్కా రాసిన లేఖను ట్రంప్‌కు అందించారు. మరోవైపు, యుద్ధ విరమణ కోసం వాషింగ్టన్‌లో ట్రంప్, జెలెన్‌స్కీ, యూరప్ నేతలు భేటీ అవుతున్న తరుణంలోనే.. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగాయి. ఈ దాడుల్లో ఏడుగురు చనిపోయారని ఉక్రెయిన్ ప్రకటించింది.ఆ రెండూ వదులుకోవాల్సిందే!జెలెన్‌స్కీ, యూరప్ దేశాల నేతలతో భేటీకి ముందు యుద్ధ విరమణ కోసం ఉక్రెయిన్ తన డిమాండ్లను వదులుకోవాల్సిందేనంటూ ట్రంప్ ట్రూత్ వేదికగా పోస్టు పెట్టారు. 12 ఏళ్ల క్రితం రష్యా చేతిలోకి వెళ్లిన క్రిమియా ద్వీపకల్పం తిరిగి రాదని, నాటోలోకి ఉక్రెయిన్‌కు ప్రవేశం ఉండదని ట్రంప్ స్పష్టం చేశారు. అయితే రష్యాకు ఉక్రెయిన్ భూభాగాల అప్పగింత అంశాన్ని మాత్రం ఆయన ప్రస్తావించలేదు.

మొదటి పేజి తరువాయి

## గలగలా గోదారి.. బిరబిరా కృష్ణమ్మ!



ఈ కబురు, హైదరాబాద్: బిరబిరా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. గలగలా గోదావరి ఉరుకులు పరుగులు పెడుతోంది. కృష్ణా పరీవాహకంలో ఆల్మట్టి నుంచి ప్రకాశం బరాజ్ వరకు.. గోదావరి పరీవాహకంలో సింగూరు నుంచి ధవళేశ్వరం బరాజ్ వరకు అన్ని ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేయడంతో ఉభయ నదులు స్వేచ్ఛగా పరుగెడుతూ కడలిలో కలిసిపోతున్నాయి. కృష్ణా పరీవాహకంలో ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జూరాల ప్రాజెక్టులోకి 1.85 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.79 లక్షల క్యూసెక్కులను వదిలేస్తున్నారు.

జూరాల, తుంగభద్ర నుంచి వస్తున్న వరదతో శ్రీశైలంకు ఇన్‌ఫ్లో భారీగా పెరిగింది. సోమవారం సాయంత్రం శ్రీశైలం జలాశయానికి 3.29 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 10 గేట్లను 12 అడుగుల మేర పైకెత్తి 4.03 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు విద్యుదుత్పత్తి ద్వారా మరో 66,099 క్యూసెక్కులను విడుదల చేస్తుండడంతో సాగర్‌లోకి 3.05 లక్షల క్యూసెక్కులకు వరద చేరుతోంది.సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా 299.74 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 26 గేట్లను పైకెత్తి 2.25లక్షల క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ద్వారా 28,826 క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తుండటంతో పులిచింతల ప్రాజెక్టుకు వరద ప్రవాహం 2.47 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో 10గేట్లను పైకెత్తి 2.93 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా మరో 16 వేల క్యూసెక్కులను కిందికి విడుదల చేస్తున్నారు. గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువన మహారాష్ట్రలోని జైక్వాడ్ ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 102.73 టీఎంసీలు కాగా, నిల్వలు 97.86 టీఎంసీలకు చేరాయి. రాష్ట్రంలో మంజీరపై ఉన్న సింగూరు ప్రాజెక్టుకి 36,309 క్యూసెక్కుల వరద వస్తుండగా, 19.6 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 40,821 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న నిజాంసాగర్ గరిష్ట సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా, 95,000 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 14.98 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 1.25లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీరామ్‌సాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా, ప్రాజెక్టుకి 1.17 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో 72.99 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 39 గేట్లను పైకెత్తి 2 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్టు సామర్థ్యం 4.7 టీఎంసీలు కాగా, 34,493 క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 3.61 టీఎంసీల నిల్వ కొనసాగిస్తూ, 34,194 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

దిగువన ఉన్న ఎల్లంపల్లి నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీలు కాగా 15.78 టీఎంసీల నిల్వను కొనసాగిస్తూ 1.69 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. సుందిళ్ల బరాజ్‌కి 1.59 లక్షలు, అన్నారం బరాజ్‌కి 6905 క్యూసెక్కులు, మేడిగడ్డ బరాజ్‌కి 4.29 లక్షల క్యూసెక్కులు, సమ్మక్కబరాజ్‌కి 4.98 లక్షల క్యూసెక్కులు, సీతమ్మసాగర్ బరాజ్‌కి 5.87 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందికి విడుదల చేస్తున్నారు.

## ట్రాఫిక్ జాంలో చిక్కుకుంటే టోల్ ఎందుకు కట్టాలి

న్యూఢిల్లీ, ఈ కబురు: ప్రయాణికులు ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుకొని అవస్థలు పడిన సందర్భాల్లో టోల్ రుసుము ఎందుకు చెల్లించాలని సుప్రీంకోర్టు సోమవారం భారతీయ జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ)ని ప్రశ్నించింది. 65 కి.మీ. దూరం ప్రయాణానికి 12 గంటల సమయం తీసుకున్న సందర్భాల్లోనూ టోల్ రుసుము కింద రూ.150 చెల్లించాలా అని అడిగింది. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో కేరళలోని త్రిస్సూర్ జిల్లా పలియెక్కర ట్లోల్ ప్లాజా వద్ద నాలుగు వారాల పాటు రుసుము వసూలు చేయకూడదని ఈ నెల 6న కేరళ హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. రోడ్డు పనులు జరుగుతుండడంతో 554 నెంబరు జాతీయ రహదారిలో ఎడపల్లి మన్నుతి మధ్య ప్రయాణం దారుణంగా మారింది. అందువల్ల నెల రోజుల పాటు టోల్ రుసుము వసూలును సస్పెండ్ చేస్తున్నట్టు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీన్ని సవాలు చేస్తూ దాఖలయిన అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాల ధర్మాసనం విచారణ చేపట్టింది. గంట ప్రయాణానికి అదనంగా 11 గంటలు తీసుకుంటే టోల్ రుసుము ఎందుకు చెల్లించాలని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. ఎన్‌హెచ్‌ఏఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ లారీ ప్రమాదానికి గురయిన కారణంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని, ఆ ప్రమాదం దైవఘటన అని చెప్పారు. ఇందుకు జస్టిస్ వినోద్ చంద్రన్ అంగీకరించలేదు. ఆ ప్రమాదం దైవఘటన కాదని, రోడ్డుపై ఉన్న గుంతలో లారీ దిగబడడం వల్లనే ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని గుర్తు చేశారు. 11గంటల ట్రాఫిక్ జామ్‌లో కూడా టోల్ వసూలు ఏ రకంగానూ సమర్థించలేమన్నారు. తీర్పును వాయిదా వేశారు.



మొదటి పేజి తరువాయి

## రేవంత్ చేతకానితనం వల్లే పరిశ్రమలు పారిపోతున్నాయి: కేటీఆర్



ఈ కబురు,హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత, సీఎం రేవంత్ రెడ్డి చేతకాని పాలనతో పరిశ్రమలు తెలంగాణ నుంచి పారిపోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్ చేతకాని పాలనతో రూ. 2,800 కోట్ల కేన్స్ పెట్టుబడి గుజరాత్‌కు తరలిపోయిందని విమర్శించారు.

ప్రత్యక్షంగా 2 వేలమంది తెలంగాణ యువత ఉద్యోగాలకు రేవంత్ సర్కార్ గండికొట్టిందని ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ శ్రమ.. రేవంత్ చేతకానితనం వల్ల బూడిదలో పోసిన పన్నీరుగా మారిందన్నారు. ఢిల్లీకి ఏటీఎంలా రాష్ట్రాన్ని వాడుకోవడమే కాంగ్రెస్ ఏకైక అజెండా అని కేటీఆర్ మండిపడ్డారు.

**ఇదొక "చెత్త" సర్కారు!**

రాష్ట్ర మున్సిపల్ శాఖ, ఆరోగ్య శాఖల సమన్వయ లోపంతో ఎక్కడ చూసినా మురుగు నీరు, చెత్తకుప్పలతో హైదరాబాద్ నగరం, రాష్ట్రంలోని ఇతర పట్టణాలు కంపుకొడుతున్నాయని ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు కేటీఆర్ "ఈ వర్షా కాలం సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. బీఆర్ఎస్ హయాంలో వర్షా కాలానికి 2 నెలల ముందు నుంచే సీజనల్ వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలపై మున్సిపల్ శాఖ, జీహెచ్ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖలు సమీక్షా, సమన్వయ సమావేశాలు నిర్వహించి, ముందస్తు చర్యలు చేపట్టేవి. కానీ ఇప్పుడా పరిస్థితులు కనిపించడం లేదు. ప్రజలు ఈసురోమని అలమటిస్తుంటే పాలకులు మాత్రం "ఆర్ఆర్ ట్యాక్స్" వసూళ్లలో బిజీగా ఉన్నారు! ' అని విమర్శించారు.

మొదటి పేజి తరువాయి

## బీసీలంటే బీజేపీకి ఏమాత్రం ఇష్టం లేదు



రాజకీయ ప్రయోజనాల కోసం కులగణను తప్పు పట్టవద్దు. దీన్ని తప్పుపడితే మరో వందేళ్ల వరకు బీసీలకు న్యాయం జరగదు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లులు రూపొందించి ఆమోదం కోసం గవర్నర్‌కు పంపి నెలలు గడుస్తున్నా వాటిని ఆమోదించలేదు. సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో కేసీఆర్ చేసిన చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్‌ను రూపొందించి, గవర్నర్ ఆమోదం కోసం పంపగా, అది కూడా రాష్ట్రపతి వద్దే పెండింగ్‌లో ఉంది'' అని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లులను ఆమోదించాలని ఢిల్లీలో ధర్నా చేశామని, 100 మందికి పైగా ఎంపీలు వచ్చి మద్దతు తెలిపారని గుర్తు చేశారు. ఈ ధర్నాకు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది కిషన్‌రెడ్డి, మోదీ కాదా? అని నిలదీశారు. దొంగ ఓట్లతోనే మహారాష్ట్రలో అధికారందొంగ ఓట్లతో బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ''మహారాష్ట్రలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీలభించగా, తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు అంత తేడా వచ్చింది? నాలుగు నెలల్లోనే ఎన్నికల కమిషన్ కోటి ఓట్లు ఎలా నమోదు చేసింది? అంబేద్కర్ పుట్టిన గడ్డ మీదనే రాజ్యాంగాన్ని అపహాస్యం చేశారు. దొంగ ఓట్లతోనే మహారాష్ట్రలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. దేశం నలుమూలలా ఓట్ల చోరీ జరుగుతోంది. బతికున్న వారిని చనిపోయినట్లుగా చూపి, బీహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారు. ఈ కుట్రను రాహుల్ గాంధీ బయటపెట్టారు. తప్పు చేసిన వారిని వదిలేసి తప్పును ప్రశ్నించిన రాహుల్ గాంధీని ఎన్నికల కమిషన్ అఫిడవిట్ అడుగుతోంది. ఇది ఎంతవరకు న్యాయం? ఓటు హక్కును దొంగిలించిన వారిని శిక్షించాలని రాహుల్‌గాంధీ పాదయాత్ర చేస్తున్నారు. త్వరలో నేను, భట్టి ఆ పాదయాత్రలో పాల్గొంటాం. అందరం కలిసి ఓట్ల చోరీకి పాల్పడే వారి భరతం పడదాం. సమస్య వచ్చినపుడు పోరాడేందుకు మీ నైతిక మద్దతు ఉండాలి'' అని కోరారు. విగ్రహాల ఏర్పాటు వర్ధంతులు, జయంతుల కోసమే కాదు, యువతలో స్ఫూర్తిని రగిలించేందుకని ముఖ్యమంత్రి చెప్పారు. మొగలుల పాలన కాలంలోనే బహుజనుల సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. అందుకే సచివాలయం సమీపంలో పాపన్న విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఖిలా షాపూర్ కోటను మైనింగ్ పేరుతో కాలగర్భంలో కలిపే కుట్ర చేసిందని ఆరోపించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ చారిత్రక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

## ఓటు చోరీకి ఆయుధంగా ఎస్ఐఆర్

ఔరంగాబాద్/గయా జీ ,ఈ కబురు: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) అనేది ఓట్లను దొంగిలించేందుకు వాడుతున్న ఆయుధమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఓట్ల చోరీని అడ్డుకొని 'ఒక వ్యక్తి.. ఒక ఓటు'ను పరిరక్షించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. ఈ మేరకు గత లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసి.. ప్రస్తుత ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటుహక్కును కోల్పోయిన పలువురితో తాను మాట్లాడిన వీడియోను రాహుల్ తన వాట్సాప్ చానల్‌లో పోస్ట్ చేశారు. బిహార్‌లోని ససారాం నుంచి చేపట్టిన ఓటరు అధికార యాత్ర ప్రారంభం సందర్భంగా వారితో రాహుల్ మాట్లాడారు. దేశంలో ఓటు చోరీ జరుగుతోందని చెప్పడానికి వీడియోలో తన పక్కన నిలబడ్డవారే సజీవ సాక్ష్యమన్నారు. వారంతా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారని, కానీ.. అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి వారి గుర్తింపు, ఉనికి కూడా లేకుండా భారత ప్రజాస్వామ్యం నుంచే తొలగింపునకు గురయ్యాయని తెలిపారు. వారి పేర్లను రాహుల్ వెల్లడించారు. వారిలో మాజీ సైనికుడు, రైతు అయిన రాజ్‌మోహన్ సింగ్ (70) కూడా ఉన్నారని తెలిపారు. ఓట్ల తొలగింపులో ఈసీ మాజీ సైనికులను వారు వదిలిపెట్టలేదని మండిపడ్డారు. అనంతరం ఔరంగాబాద్‌లో మరికొందరు బాధితులను కలుసుకున్న వీడియోను రాహుల్‌గాంధీ పోస్ట్ చేశారు. ''గత నాలుగైదు ఎన్నికల్లో ఓటు వేసినవారి ఓటుహక్కును కూడా దొంగిలించారు. కారణం అడిగితే.. పైనుంచి ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారు'' అని రాహుల్ తెలిపారు. ఏదో ఒకరోజు ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, ఓటు చోరీకి పాల్పడ్డందుకు సీఈసీపై, ఇద్దరు ఎన్నికల కమిషనర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసీ నేరాన్ని బయట పెట్టిన తనను అఫిడవిట్ అడుగుతున్నారని, కానీ.. దేశం మొత్తం వారినే అఫిడవిట్ అడిగే పరిస్థితి వస్తుందని అన్నారు. తమకు కొద్దిగా సమయమిస్తే.. ప్రతి అసెంబ్లీ స్థానం, లోక్‌సభ స్థానంలో ఓట్ల చోరీని బయటపెడతామని చెప్పారు. కాగా, ఓట్లు తొలగించామంటూ రాహుల్‌వీడియోలో పేర్కొన్న వక్తుల వివరాలను తమకు అందజేయాలని ఈసీ కోరింది.



## భారతీయులందరికీ స్ఫూర్తి: ప్రధాని మోదీ



ఈ కబురు: న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధనలకు పెద్దపీట వేసే ప్రధాని మోదీ దేశ గగన్‌యాన్ కలలను సాకారంచేసే భారత వ్యోమగామి శుభాంశు శుక్లాను కలిసిన వేళ ఆనందంలో మునిగిపోయారు. రష్యా, అమెరికా మొదలు ఇస్రో, నాసా దాకా అన్ని రకాల వ్యోమగామి శిక్షణా వ్యయాలను భరించిన భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ప్రధాని మోదీని కలిసిన వేళ శుభాంశు శుక్లా సైతం ఒకింత ఉద్వేగ్నానికి లోనయ్యారు. అంతరిక్షకేంద్రంలో తాను అనుభవించి, గడించిన అద్వితీయ అనుభూతిని, అనుభవాన్ని చిన్న పిల్లాడిలా ఎంతో ఉత్సాహంతో ప్రధాని మోదీకి పూసగుచ్చినట్లు వివరించారు. ఈ అపురూప ఘట్టానికి ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని అధికార నివాసం వేదికైంది. జూన్ 25 నుంచి జూలై 15వ తేదీదాకా యాగ్జియం-4 మిషన్ తరపున అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో గడిపిన భారత మొట్టమొదటి వ్యోమగామిగా చరిత్ర లిఖించాక తొలిసారిగా శుభాంశు శుక్లా ప్రధాని మోదీని సోమవారం కలిసి తన అనుభవాలను పంచుకున్నారు. ''వ్యోమగామిగా మాత్రమే కాదు అవనికి ఆవల సైతం భారతీయులు తమ కలలను నెరవేర్చుకోగలరని నువ్వు నిరూపించావు. వాళ్లకు స్ఫూర్తిగా నిలిచావు''అని శుక్లాను మోదీ పొగిడారు. శుక్లా చెప్పిన ప్రతి విషయాన్ని మోదీ ఎంతో శ్రద్ధగా ఆలకించారు. భారత త్రివర్ణ పతాకాన్ని ఐఎస్ఎస్‌లో రెపరెపలాడించినందుకు శుభాంశును మోదీ మనసారా అభినందించారు. వ్యోమగామి ప్రత్యేక జాకెట్ ధరించి వచ్చిన శుభాంశు కలవగానే కరచాలనం చేసి మోదీ ఆయనను ఆత్మీయంగా హత్తుకున్నారు. శెభాష్ అంటూ భుజం తట్టారు. కొద్దిసేపు హాల్‌లో నడుస్తూ మాట్లాడారు. తర్వాత కూర్చుని శుక్లా సవివరంగా తన అంతరిక్ష యాత్ర వివరాలను మోదీకి తెలియజేశారు. ట్యాబ్‌లో పలు అంశాలను సోదాహరణంగా వివరించారు.

ఆ తర్వాత మోదీకి రెండు బహుమతులను బహూకరించారు. ఐఎస్ఎస్‌కు వెళ్లినప్పుడు తన వెంట తీసుకెళ్లి తిరుగు పయనం వేళ మళ్లీ వెంట తీసుకొచ్చిన త్రివర్ణ పతాకాన్ని మోదీకి శుభాంశు బహూకరించారు. తర్వాత శుక్లాతో భేటీ వివరాలను ప్రధాని తన సామాజికమాధ్యమం 'ఎక్స్'ఖాతాలో పోస్ట్ చేశారు. ''శుభాంశు శుక్లాతో భేటీ అద్భుతంగా సాగింది. అంతరిక్షంలో ఉన్నప్పుడు ఆయన చేసిన ప్రయోగాలు మొదలు అక్కడి సహచరుల తోడ్పాటు, అక్కడి ప్రయోగాల సత్ఫలితాలు, శాస్త్ర, సాంకేతికతల పురోభివృద్ధి, భారత ప్రతిష్టాత్మక గగన్‌యాన్ మిషన్ ప్రాజెక్ట్ వివరాలపై ఎన్నో విషయాలు నాతో పంచుకున్నారు.



మొదటి పేజీ తరువాయి

# నేడు శేరిలింగంపల్లి బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం



కొమిరిశెట్టి సాయిబాబా

**24వ తేదీన నిర్వహించే నియోజకవర్గ ఆత్మీయ సమావేశంపై చర్చ**

ఈ-కబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని మంగళవారం మియాపూర్ లో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు మియాపూర్ లోని అతిథి హాల్ లో నిర్వహించే ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ శ్రేణులు అందరూ ఆహ్వానితులేనన్నారు. ఈనెల 24వ తేదీన నియోజకవర్గం పరిధిలోని మియాపూర్ నరేన్ గార్డెన్స్ లో శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు ఇప్పటికే అధిష్టానం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ. రామారావుతో పాటు అగ్ర నాయకులు, పార్టీ పెద్దలు హాజరవుతున్నారని అన్నారు. ఆత్మీయ సమావేశం సన్నాహక కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవలసిన ఏర్పాట్లపై చర్చించడం జరుగుతుందన్నారు. కావున నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

# రేపటినుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు

హైదరాబాద్,ఈ కబురు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవడానికి సీపీఐ సిద్ధమవుతోంది. 20 నుంచి 22వ తేదీ వరకు జరిగే పార్టీ రాష్ట్ర 4వ మహాసభల్లో ఈ అంశంపై ప్రధానంగా చర్చిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. మహాసభల వేదికకు ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు దివంగత పొట్లూరి నాగేశ్వరరావు నగర్‌గా నామకరణం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మహాసభల్లో మొత్త 743 మంది ప్రతినిధులు, ప్రత్యేక ఆహ్వానితులతో కలిపి దాదాపు వెయ్యి మంది పాల్గొంటారని చెప్పారు. బుధవారం జీడిమెట్ల పోలీసు స్టేషన్ నుంచి మహా సభల వేదిక వరకు ఫ్లాగ్ మార్చ్ ఉంటుందన్నారు. మఖ్దూం భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం పొత్తు ఉంటుందని, కాంగ్రెస్‌తో స్నేహ సంబంధాలు కొనసాగుతాయని తెలిపారు.

# సినిమాల్లో హీరో.. రియల్ లైఫ్ విలన్..

**అదనపు కట్నం కోసం భార్యపై వేధింపులు**

**హీరో ధర్మ మహేష్ పై గచ్చిబౌలిలో కేసు నమోదు**

ఈకబురు, శేరిలింగంపల్లి : సినిమాల్లో హీరో తన రియల్ లైఫ్ లో కట్టుకున్న భార్యకే విలన్ గా మారాడు. సినిమా అవకాశాలు పెరగడంతో జల్సాలు, షికార్లకు అలవాటు పడిన హీరో ధర్మ మహేష్ అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నాడంటూ అతని భార్య పోలీసులను ఆశ్రయించింది. దీంతో హీరో ధర్మా మహేష్ మీద గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..
సింధూరం, డ్రింకర్ సాయి సినిమాలలో హీరోగా నటించిన ధర్మా మహేష్ అలియాస్ కాకాని ధర్మసత్య సాయి శ్రీనివాస మహేష్(30) మాదాపూర్ లోని ఫార్చ్యూన్ టవర్స్ లో నివాసం ఉంటున్నాడు. ధర్మ మహేష్ కు 2013లో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గౌతమి (31) తో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారగా 2019లో వీరు వివాహం చేసుకున్నారు.



నటుడు ధర్మ మహేష్

వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. గౌతమి, ఆమె తండ్రి అందించిన ఆర్థిక సహకారంతో ఇద్దరు కలిసి ఓ హోటల్ ఫ్రాంచైజీ వ్యాపారాన్ని సైతం ప్రారంభించారు. కాగా ఈ మధ్యకాలంలో సినిమా అవకాశాలు పెరగడంతో జల్సాలకు అలవాటు పడిన ధర్మా మహేష్, యువతులతో తిరుగుతూ భార్యను వేధింపులకు గురి చేయసాగాడు. ప్రస్తుతం తన స్టేటస్ పెరిగిందని.. అదనపు కట్నం కావాలంటూ ధర్మా మహేష్, అతని కుటుంబ సభ్యులు వేధిస్తున్నారు. గౌతమి డబ్బుతో ప్రారంభించిన హోటల్ ఫ్రాంచైజీ ని సైతం తన పేరు మీదకు మార్చుకున్నాడు. ధర్మ మహేష్, అతని కుటుంబ సభ్యుల శారీరక, మానసిక
వేధింపులకు విసిగిపోయిన భార్య గౌతమి పోలీసులను ఆశ్రయించింది. దీంతో గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్ లో హీరో ధర్మా మహేష్ మీద బిఎన్ఎస్ సెక్షన్ 85, 115(2), 316(2), 351(2), 352, సెక్షన్ 4 ఆఫ్ డిపి యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ధర్మ మహేష్ గతంలో సైతం వేధింపుల గురి చేయడంతో పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారని కానీ ధర్మా మహేష్ తీరు మారకపోవడంతో మరోసారి పోలీసులను ఆశ్రయించినట్లు గౌతమి తన ఫిర్యాదులో తెలిపింది.

# ప్రధాని మోదీకి పుతిన్ ఫోన్



ఈ కబురు, మాస్కో: అలాస్కా వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఉక్రెయిన్ యుద్ధం ముగించే విషయంపై చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వ్లాదిమిర్ పుతిన్ తనకు ఫోన్ చేసినట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్ లో 'ఇటీవల అలాస్కాలో ట్రంప్‌తో జరిగిన సమావేశం గురించి ఫోన్‌లో మాట్లాడి, తన అభిప్రాయాలను పంచుకున్నారు. నా స్నేహితుడు పుతిన్‌కు ధన్యవాదాలు. ఉక్రెయిన్ వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని భారత్ నిరంతరం కోరుకుంటుంది.ఈ విషయంలో జరుగుతున్న అన్నీ ప్రయత్నాలకు భారత్ మద్దతు పలుకుతుంది'అని పేర్కొన్నారు. ఫిబ్రవరి 2022 నుండి కొనసాగుతున్న ఉక్రెయిన్‌పై కొనసాగుతున్న రష్యా యుద్ధంపై ప్రపంచ దేశాల ఎదుట భారత్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.యుద్ధాన్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని, ఈ విషయంలో భారత్ తన పూర్తి మద్దతును అందిస్తుందని ప్రధాని కార్యాలయంలో విడుదల చేసిన ఓ ప్రకటనలో స్పష్టం చేసింది.



# తరువాయి.. త్రైపాక్షిక చర్చలు

**పుతిన్, జెలెన్‌స్కీలతో కలిసి యుద్ధాన్ని సమాప్తం చేస్తా**

**శ్వేతసౌధంలో ఈయూ కూటమి అగ్రనేతలతో సంయుక్త సమావేశం తర్వాత ట్రంప్ ప్రకటన**

**అమెరికా రాజధానిలో కీలక పరిణామం**

వాషింగ్టన్: ఉక్రెయిన్ యుద్ధానికి వీలైనంత త్వరగా ముగింపు పలికేందుకు కంకణం కట్టుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, యురోపియన్ యూనియన్ కీలక సభ్య దేశాల అగ్రనేతలు యుద్ధ పరిసమాప్తి కృషిపర్వంలో కీలక పురోగతి సాధించారు. ఇందుకు అమెరికా రాజధాని నగరం వేదికైంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌లతో కలిసి తాను త్రైపాక్షిక సమావేశం నిర్వహించబోతున్నట్లు ట్రంప్ ప్రకటించారు.
స్థానిక కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం వాషింగ్టన్‌లోని అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లోని ఈస్ట్‌రూమ్‌లో ఐరోపా సమాఖ్య కీలక సభ్యదేశాల అగ్రనేతలతో ట్రంప్ సంయుక్త సమావేశం ఏర్పాటుచేశారు. త్వరలో యుద్ధ విరమణ కోసం పుతిన్, జెలెన్‌స్కీ, ట్రంప్ త్రైపాక్షిక సమావేశం జరిపేందుకు ఈయూ నేతలు ఏకగ్రీవంగా అంగీకరించారు. అయితే ఈ త్రైపాక్షిక భేటీ ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందనేది ఇంకా నిర్ణయించలేదు. సెక్యూరిటీ గ్యారెంటీలో ఉండే ప్రధానాంశాలు సైతం ఇంకా ఖరారుకాలేదు.
'నాటో' కూటమిలో చేరకపోయినా సరే అదే తరహాలో 'రక్షణ హామీ'ని ఉక్రెయిన్‌కు అమెరికా ఇచ్చినా తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పుతిన్ పేర్కొన్న అంశం ఈ సంయుక్త సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. ఈ సంయుక్త సమావేశంల నాటో కూటమి సెక్రటరీ జనరల్ మార్క్ రూటే, యురోపియన్ కమిషన్ మహిళా అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డీర్ లేయిన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సమావేశమయ్యారు.
అయితే ఈ త్రైపాక్షిక సమావేశంలో ఈయూ తరపున సైతం ఒక ప్రతినిధి పాల్గొంటే మంచిదని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్ అభిప్రాయపడ్డారు. నాటోయేతర రక్షణహామీకి ట్రంప్ ముందుకు రావడం ఈ మొత్తం ప్రక్రియలో కీలక పరిణామమని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూటే అన్నారు. తక్షణం కాల్పుల విరమణ ప్రకటిస్తే బాగుంటుందని జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. యుద్ధకాల్పుల మోత మెల్లగా తగ్గుముఖం పట్టనుందని ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ వ్యాఖ్యానించారు. అంతకుముందు నేతలంతా ఒక గ్రూప్ ఫొటో దిగారు.

**జెలెన్‌స్కీని మెచ్చుకున్న ట్రంప్**

ఈయూ నేతలతో భేటీకి ముందు తొలుత జెలెన్‌స్కీతో ట్రంప్ విడిగా సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొన్నారు. గత భేటీలో టీ-షర్ట్ వేసుకొచ్చిన జెలెన్‌స్కీని అమెరికా మీడియా తప్పుబట్టిన నేపథ్యంలో ఈసారి నలుపు రంగు సూట్ ధరించారు. సూట్ డిజైన్‌ను ట్రంప్ మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ట్రంప్‌కు జెలెన్‌స్కీ ఒక లేఖ అందించారు. '' ఇది మీ భార్య కోసం. అయితే ఇది నేను రాసింది కాదు. నా భార్య రాసింది'' అనడంతో అందరూ ఫక్కున నవ్వేశారు. తర్వాత ట్రంప్ మాట్లాడారు. '' యుద్ధంలో యావత్ ప్రపంచమే అలసిపోయింది. మనం దీనిని ఇక ముగింపునకు తీసుకొద్దాం. ఈరోజంతా మంచే జరగబోతోంది. పుతిన్, జెలెన్‌స్కీతో కలిసి త్రైపాక్షిక భేటీ ఆమోదయోగ్యమైన రీతిలో జరిగే అవకాశముంది. ఈ యుద్ధం ముగియబోతోంది. ముగింపు అనేది అంతా కాకపోయినా కొంతైనా మిస్టర్ జెలెన్‌స్కీ చేతుల్లోనే ఉంది'' అని ట్రంప్ అన్నారు. సెక్యూరిటీ గ్యారెంటీ హామీలో భాగంగా ఉక్రెయిన్‌కు భవిష్యత్తులో అమెరికా బలగాలు మోహరిస్తారా అన్న ప్రశ్నకు ట్రంప్ సూటిగా సమాధానం చెప్పలేదు.



# సర్వేపల్లి రాధాకృష్ణన్ స్థాయికి చేరుకోవాలని..

## సీపీ రాధాకృష్ణన్‌కు పేరు పెట్టిన ఆయన తల్లి

చెన్నై,ఈ కబురు: భారత తొలి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ స్థాయికి చేరుకోవాలనే కోరికతో ఆయన పేరునే ప్రస్తుత మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు నాడు ఆయన తల్లి పెట్టారు. నేడు ఆ పదవికి ఆయన అత్యంత సమీపానికి చేరువయ్యారు. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే అభ్యర్థిగా ప్రకటించిన రాష్ట్రానికి చెందిన సీపీ రాధాకృష్ణన్ 1957 అక్టోబరు 20న తిరుప్పూర్‌లో జన్మించారు. అప్పటికే భారత తొలి ఉపరాష్ట్రపతిగా తిరుత్తణికి చెందిన తెలుగువారైన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉన్నారు. తమ కొడుకు కూడా అంతటివాడు కావాలనే ఆకాంక్షతో దేవునికి మొక్కుకుని రాధాకృష్ణన్ అనే పేరును తల్లి జానకి అమ్మాళ్ పెట్టారు. సీపీ రాధాకృష్ణన్ పూర్తి పేరు చంద్రపురం పొన్నుసామి రాధాకృష్ణన్. ఇందులో పొన్నుసామి ఆయన తండ్రి పేరు. బీబీఏ పట్టభద్రుడైన సీపీ రాధాకృష్ణన్ కళాశాల రోజుల్లో టేబుల్ టెన్నిస్, అథ్లెట్‌గా ఉన్నారు. క్రికెట్, వాలీబాల్ క్రీడలపై అమితాసక్తి ఉంది.

**తమిళనాట కమల వికాసానికి కృషి..**

భాజపాకు తమిళనాట తగిన గుర్తింపులేని రోజుల్లో ఆ పార్టీ బలోపేతానికి సీపీ రాధాకృష్ణన్ విశేష కృషి చేశారు. 1996లో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన ఆయన 1998 లోక్‌సభ ఎన్నికల్లో భాజపా అభ్యర్థిగా కోయంబత్తూర్ నుంచి పోటీ చేసి సుమారు లక్షన్నర ఓట్ల భారీ ఆధిక్యతతో గెలిచారు. తమిళనాడు భాజపా రాజకీయ చరిత్రలో ఇది గర్వించదగిన గెలుపు కావడం గమనార్హం. 2003లో డీఎంకే కూటమి నుంచి బయటికొచ్చిన భాజపాకు రాష్ట్రంలో వెనుకబాటు తప్పదనే అభిప్రాయాలు తెరపైకి రాగా జయలలితతో చర్చలు జరిపి 2004 లోక్‌సభ ఎన్నికలకు అన్నాడీఎంకేతో కూటమిని ఖరారు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో డీఎంకే, అన్నాడీఎంకే వంటి పెద్ద పార్టీలతో పొత్తు లేకున్నా భాజపా అభ్యర్థిగా కోయంబత్తూర్ నుంచి పోటీ చేసి 3.8 లక్షల పైచిలుకు ఓట్లను పొందడం ఆయన చరిష్మాకు నిదర్శనం.

**పార్లమెంటరీ కమిటీల్లో..**

సీపీ రాధాకృష్ణన్ 1998, 1999లో ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ(జౌళి) ఛైర్మన్‌గా, పార్లమెంటరీ కమిటీ(పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్స్), కన్సల్టేటివ్ కమిటీ, స్టాక్ ఎక్స్ఛేంజ్ అక్రమాలపై దర్యాప్తునకు సంబంధించిన పార్లమెంటరీ ప్రత్యేక కమిటీలలో సభ్యుడుగా ఉన్నారు. 2004లో పార్లమెంటరీ ప్రతినిధి బృందంలో భాగంగా ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రసంగించారు. తైవాన్‌కు వెళ్లిన మొదటి పార్లమెంటరీ ప్రతినిధి బృందంలోనూ ఆయన సభ్యుడు.



# ఆర్థిక సంస్కరణలపై ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష



స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన తదుపరి తరం ఆర్థిక సంస్కరణల అమలుపై ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, శివరాజ్‌సింగ్ చౌహాన్, పీయూష్ గోయల్, లలన్ సింగ్, కార్యదర్శులు, ఆర్థికశాస్త్రవేత్తలు పాల్గొన్నారు. జీఎస్టీలో సంస్కరణలు, సెమీ కండక్టర్, ఎరువుల రంగాల్లో స్వావలంబ సాధన, సులభతర జీవనం, వాణిజ్యం తదితర అంశాలపై మార్గసూచీని రూపొందించే దిశగా చర్చలు సాగాయి.

# ముంబైలో రెడ్ అలర్ట్



ముంబై, ఈ కబురు: భారీ వర్షా లు ముంబై నగరాన్ని ముంచెత్తుతున్నాయి.
ముంబైతోపాటు మహారాష్ట్రలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షా లు కురుస్తున్నాయి. ఎడతెరపిలేని వానల కారణంగా నాందేడ్ జిల్లా ముఖేడ్ తాలూకాలో ఐదుగురు గల్లంతయ్యారు. 200 మందికిపైగా వరదల్లో చిక్కుకుపోయారు. ముంబైలో సోమవారం 17.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంబై, థాణె, రాయగడ్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరో మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షా లు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రెడ్ అలర్ట్ జారీచేసింది. దీంతో అధికారులు సోమవారం మధ్యాహ్నం నుంచి పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. మూడు రోజులుగా కురుస్తున్న వానలకు ముంబైలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలించక అనేక విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది.
ముంబై నగరంలో భారీ వర్షా లు కురుస్తున్నందున షెడ్యూల్ సమయం కంటే కాస్త ముందుగానే విమానాశ్రయాలకు చేరుకోవాలని ప్రముఖ విమానయాన సంస్థలు ఇండిగో, ఆకాశ ఎయిర్, స్పైస్ జెట్ తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీచేశాయి. విమానాశ్రయానికి బయల్దేరే ముందు తమ వెబ్‌సైట్‌లో విమాన సర్వీసులకు సంబంధించిన వివరాలను తనిఖీ చేసుకోవాలని సూచించాయి.
అత్యవసరమైతే తప్ప పౌరులు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) విజ్ఞప్తి చేసింది. అరేబియా సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరించింది.

# భారత్‌లో యాపిల్ రూ.1010 కోట్ల ఆఫీస్..

**టెక్ దిగ్గజం యాపిల్ ఇండియా తన దేశీయ కార్యకలాపాలను విస్తరించే దిశగా భారీ అడుగు వేసింది. బెంగుళూరులోని వసంత్‌నగర్‌లో ఉన్న ఎంబసీ జెనిత్ భవనంలో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని లీజ్‌కు తీసుకుంది. ఈ డడీల్ విలువ సుమారు రూ.1,010 కోట్లు కాగా, ఇదే ఇప్పటివరకు యాపిల్ ఇండియాలో తీసుకున్న అతిపెద్ద కార్యాలయ స్థలం.**



**డీల్‌లోని కీలక అంశాలు**

ఎంబసీ గ్రూప్‌కు చెందిన సంస్థ మాక్ చార్ల్స్ (ఇండియా) లిమిటెడ్ నుంచి యాపిల్ ఈ స్థలాన్ని లీజ్‌కు తీసుకుంది. 5వ అంతస్తు నుండి 13వ అంతస్తు వరకూ మొత్తం 2.7 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని యాపిల్ తీసుకుంది. ఇందుకు నెలకు రూ.6.315 కోట్లు (చదరపు అడుగుకు రూ.235) చొప్పున అద్దె చెల్లించనుంది. ఈ లీజ్ కాల వ్యవధి 10 సంవత్సరాలు. ఏటా 4.5 శాతం చెప్పున అద్దె పెరుగుతుంది. ఇందుకోసం సెక్యూరిటీ డిపాజిట్ రూ.31.57 కోట్లుగా డీల్‌లో రాసుకున్నారు.

**ఇంకా విస్తరించే యోచన**

ఎంబసీ జెనిత్ భవనంలో 5 నుండి 13వ అంతస్తు వరకు లీజుకు తీసుకున్న యాపిల్ సంస్థ భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్ నుండి 4వ అంతస్తు వరకు అదనంగా 1.21 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కూడా అద్దెకు తీసుకునే అవకాశాన్ని పరిశీలిస్తోంది. ఇది జరిగితే, మొత్తం కార్యాలయ విస్తీర్ణం 4 లక్షల చదరపు అడుగులకు చేరుతుంది.

**భారత్‌లో వ్యూహాత్మక ప్రాధాన్యత**

యాపిల్ ఈ విస్తరణతో భారతదేశంలో తన ఉనికిని మరింత పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. దేశీయంగా ఐఫోన్ ఉత్పత్తిని పెంచనున్నట్లు ఇప్పటికే యాపిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. బెంగుళూరు, పుణేలో రిటైల్ స్టోర్లను ప్రారంభించడం ద్వారా భారత టెక్, మాన్యుఫాక్చరింగ్ రంగాల్లో కీలక పాత్ర పోషించాలని యాపిల్ భావిస్తున్నట్లుగా మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. యాపిల్ ఇప్పటికే 2021లో ప్రెస్టిజ్ మిన్స్క్ స్క్వేర్‌లో 1.16 లక్షల చదరపు అడుగుల కార్యాలయాన్ని అద్దెకు తీసుకుంది, 2023లో అక్కడ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.



# జీఎస్‌టీ రేట్ల సవరణతో వాహన ధరలు తగ్గే వీలు!

**ఢిల్లీ:** వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) విధానంలో మార్పులు తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుత విధానంలో నాలుగు పన్ను శ్లాబ్‌లు (5%, 12%, 18%, 28%) ఉండగా.. ఇకపై రెండు శ్లాబ్‌లు (5%, 18%) మాత్రమే ఉంటాయి. కొన్ని హానికారక వస్తువులపై 40% పన్ను ఉంటుంది. ప్రస్తుతం సంప్రదాయ వాహన రంగం అత్యధిక పన్ను రేటు 28% శ్లాబ్‌లో ఉంది. దీనికి అదనంగా వాహన రకాన్ని బట్టి 122% వరకు పరిహార సెస్ విధిస్తున్నారు. ఫలితంగా ఇంజిన్ సామర్థ్యం, పొడవు ప్రకారం.. చిన్న పెట్రోల్ కార్లపై 29% నుంచి ఎస్‌యూవీలపై 50% వరకు పన్ను చెల్లించాల్సి వస్తోంది. విద్యుత్ వాహనాలపై మాత్రం 5% పన్నే ఉంది. దీపావళికి జీఎస్‌టీ రేట్లు తగ్గితే, అందుబాటు ధర కార్లు వినియోగదార్లను మరింత ఆకర్షిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. పండగ ఉత్సాహానికి ఇది మరింత ఉపకరించనుంది. ప్రస్తుత జీఎస్‌టీ విధానంలో ఇంజిన్ సామర్థ్యం, వాహన పరిమాణానికి సంబంధించిన వర్గీకరణ వివాదాలను కొత్త పన్ను రేట్ల ప్రతిపాదన పరిష్కరిస్తుందని ఆశిస్తున్నారు. కార్ల ఇంజిన్ సామర్థ్యం, పొడవుల ఆధారంగా వర్గీకరణ వల్ల తలెత్తుతున్న వివాదాలను పరిష్కరించేందుకు, అన్ని వాహనాలను ఒకే శ్లాబ్‌లో ఉంచే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. తక్కువ జీఎస్‌టీ రేటు వల్ల కార్ల ధరలు తగ్గి.. వాటి గిరాకీ, విక్రయాలు పెరగనున్నాయి. వినియోగం పెంచడమే ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త పన్ను రేట్ల లక్ష్యంగా తెలుస్తోంది.

# అంబానీపై అప్పు రూ.3.47 లక్షల కోట్లు!

రిలయన్స్ ఇండస్ట్రీస్ అప్పులు భారీగా పెరిగిపోయాయి. మంచి లాభాల్లో నడుస్తున్న, దేశంలోనే అత్యంత సంపన్నుడైన ముఖేష్ అంబానీకి చెందిన కంపెనీకి అప్పులేంటి అనుకుంటున్నారా? కంపెనీ ఎంత లాభాలను ఆర్జిస్తున్నప్పటికీ వ్యాపారాలను విస్తరించడానికి అప్పులు అవసరమవుతాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ వివిధ రంగాల్లో దూకుడుగా పెట్టుబడులను కొనసాగిస్తోంది. అందుకే అప్పులు పెరిగాయి.



ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) 202425 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం.. కంపెనీ మొత్తం అప్పు రూ.3.47 లక్షల కోట్లు కాగా, నికర రుణం రూ.1.17 లక్షల కోట్లు. గతేడాది అంటే 2024 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం అప్పు రూ.3.24 లక్షల కోట్లు. బలమైన ఆర్థిక స్థితిని కొనసాగిస్తూనే వ్యాపారాలను పెంచుకునేందుకు భారీ పెట్టుబడులు పెట్టినట్లు కంపెనీ తన వార్షిక నివేదికలో పేర్కొంది.

2025 ఆర్థిక సంవత్సరంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.1,31,107 కోట్ల మూలధన వ్యయాన్ని చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం 202324లో ఈ మొత్తం రూ.1,31,769 కోట్లుగా ఉంది. వార్షిక నివేదిక ప్రకారం, 2025 ఆర్థిక సంవత్సరం పెట్టుబడులలో ఎక్కువ భాగం క్రూడాయిల్ నుంచి కెమికల్స్ తయారు చేసే కొత్త ఓ2సీ ప్రాజెక్టులు, రిటైల్ స్టోర్ల ఏర్పాటు, డిజిటల్ సర్వీసుల పెంపు, నూతన ఇంధన వెంచర్లను అభివృద్ధి వైపు మళ్లించింది

రిలయన్స్ ఇండస్ట్రీస్. ఇక ఆదాయం విషయానికి వస్తే రిలయన్స్ ఇండస్ట్రీస్ 2025 ఆర్థిక సంవత్సరంలో రూ.5,57,163 కోట్ల ఆదాయం ఆర్జించింది. అంతక్రితం ఏడాది రూ.5,74,956 కోట్లతో పోలిస్తే ఇది 3.1 శాతం తక్కువ. కంపెనీ ఎబిటా గత ఏడాది రూ.86,393 కోట్ల నుంచి 14.2 శాతం క్షీణించి రూ.74,163 కోట్లకు పరిమితమైంది.



# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

సోమవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 676.09 పాయింట్లు లేదా 0.84 శాతం లాభంతో 81,273.75 వద్ద, నిఫ్టీ 245.65 పాయింట్లు లేదా 1.00 శాతం లాభంతో 24,876.95 వద్ద నిలిచాయి. పెన్నార్ ఇండస్ట్రీస్, లక్ష్మీ ఆర్గానిక్ ఇండస్ట్రీస్, IFB ఇండస్ట్రీస్, సదరన్ పెట్రోకెమికల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, రవీందర్ హైట్స్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరగా.. ప్రీతి ఇంటర్నేషనల్, అగర్వాల్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్, డేటామాటిక్స్ గ్లోబల్ సర్వీసెస్, ప్రోస్టార్మ్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్, NDL వెంచర్స్ వంటి కంపెనీలు నష్టాలను చవిచూశాయి.

# విశాఖ ప్లాంటు నుంచి అమెరికా, ఐరోపాలకు 20 ఉత్పత్తులు!

**అరబిందో ఫార్మా**

**ఢిల్లీ:** అమెరికా, ఐరోపాల్లో విక్రయించడానికి 20కు పైగా నూతన ఉత్పత్తులకు అనుమతులు కోరుతూ, దరఖాస్తు చేయనున్నామని.. విశాఖపట్నంలోని యూజియావీ ప్లాంట్ నుంచి వీటిని ఎగుమతి చేయనున్నట్లు అరబిందో ఫార్మా ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) సంతానం సుబ్రమణియన్ వివరించారు. ఇప్పటి వరకు బయోలాజిక్స్ సీఎంఓ (కాంట్రాక్ట్ తయారీ) వ్యాపారంపై 30 మిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టామని, 2027 మార్చికి మరో 100 బి.డాలర్ల పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (అక్టోబరుడిసెంబరు)లో తమ చైనా ప్లాంట్ లాభ నష్టాలు లేని స్థాయి (బ్రేక్ ఈవెన్)కి చేరే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. '200 కోట్లకు పైగా ట్యాబ్లెట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన చైనా ప్లాంట్‌ను విస్తరిస్తున్నాం. రాబోయే త్రైమాసికాల్లో గణనీయ ఆదాయాన్ని ఈ ప్లాంట్ అందిస్తుందన్నారు. 2024 నవంబరులో ప్రారంభమైన ఈ ప్లాంట్‌పై దాదాపు 145 మిలియన్ డాలర్ల (రూ.1,200 కోట్లకు పైగా) పెట్టుబడులు పెట్టారు.




AUROBINDO

**అమెరికాలో త్వరలో ఉత్పత్తి ప్రారంభం**

అమెరికాలోని రెండు ప్లాంట్‌లపై దాదాపు 70 మిలియన్ డాలర్ల (సుమారు రూ.600 కోట్లు) పెట్టుబడులు పెట్టామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే వాటిల్లో ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సుబ్రమణియన్ వెల్లడించారు.
భవిష్యత్‌లో స్థిర వృద్ధిని కొనసాగించడంపై ఆశావహంగా ఉన్నామని సుబ్రమణియన్ తెలిపారు. సామర్థ్యాల విస్తరణ, కొత్త ఉత్పత్తుల విడుదల, స్థిరమైన ధరలే ఇందుకు కారణమని.. అమెరికా, ఐరోపా విపణులు మద్దతుగా నిలవొచ్చన్నారు. కొత్త తయారీ కేంద్రాల్లో వాణిజ్య కార్యకలాపాల విస్తరణతో రాబోయే త్రైమాసికాల్లో ఆదాయం వృద్ధి చెందడంతో పాటు మార్జిన్లు మెరుగుపడతాయని స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2021% మార్జిన్ లక్ష్యాన్ని సాధించడంపై ధీమాగా ఉన్నామని అన్నారు.
ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో అరబిందో ఫార్మా ఏకీకృత నికర లాభం 10% తగ్గి రూ.824 కోట్లకు పరిమితమైంది. అమెరికాలో విక్రయాలు తగ్గడం, ఏపీఐ వ్యాపార విభాగం నిరాశపరచడం ప్రభావం చూపాయి. మొత్తం కార్యకలాపాల ఆదాయం మాత్రం రూ.7,567 కోట్ల నుంచి రూ.7,868 కోట్లకు పెరిగింది.




# పండగ సీజన్‌పై అమెజాన్ ఆశావహం

**ఢిల్లీ:** రాబోయే పండగ సీజన్ అమ్మకాలపై అమెజాన్ ఇండియా ఎంతో ఆశావహంగా ఉంది. గత నెలలో ప్రైమ్ డే అమ్మకాలు బలంగా నమోదు కావడం, చిన్న నగరాల నుంచి పెరుగుతున్న గిరాకీ వల్లే.. ఆశావాదం బలపడిందని అమెజాన్ ఇండియా హెడ్ సమీర్ కుమార్ వెల్లడించారు. పండగ సీజన్‌లో లభించే గిరాకీకి అనుగుణంగా వస్తువులు అందించేందుకు కంపెనీ సరఫరా వైపు సంసిద్ధతను పెంచిందని వివరించారు. వివిధ ప్రాంతాల్లో బహుమతి సంప్రదాయాలు, లాభదాయక తగ్గింపులు, కొత్తకాలానుగుణ ఉత్పత్తులపై వినియోగదార్ల ఆసక్తి వంటి వాటి ద్వారా బ్రాండ్‌లకు పండగ సీజన్ అతి పెద్ద వార్షిక అవకాశాలలో ఒకటిగా ఉందని తెలిపారు. జియోస్టార్ ఫెస్టివ్ సెంటిమెంట్ సర్వే 2025 ఎడిషన్ ప్రకారం, 92% మంది భారతీయ వినియోగదార్లు ఈ ఏడాది తమ పండగ వ్యయాలను కొనసాగించాలని లేదా పెంచాలని యోచిస్తున్నారు. ఇది బలమైన వినియోగదార్ల విశ్వాసాన్ని, బ్రాండ్లకు సువర్ణావకాశాన్ని సూచిస్తోంది. ప్రైమ్ డే అమ్మకాల గణాంకాలను ప్రస్తావిస్తూ, గతంతో పోలిస్తే మంచి వృద్ధి నమోదు చేశామని సమీర్ కుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా రెండో, మూడో అంచె నగరాల నుంచి మంచి సహకారం లభించిందని తెలిపారు. వినాయక చవితితో పండగ సీజన్ వస్తోందని, ఇప్పటికే సరఫరా వైపు సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు.

జెన్ జడ్ (1529 ఏళ్ల) వారి కంటే మిలీనియల్స్ (3045 ఏళ్లు) ఎక్కువగా వ్యయాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని సర్వే తెలిపింది. మహిళలు దుస్తులు, సౌందర్య, గ్యాడ్జెట్లు, గృహ అలంకరణ తదితర విభాగాల్లో షాపింగ్ చేసేందుకు అధికంగా ఆసక్తి చూపిస్తున్నారు. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల్లో పండగ సీజన్ ముందస్తు సంకేతాలు కనిపిస్తున్నాయని జెప్టో సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అదిత్ పలీచా ఇటీవల లింక్డ్ఇన్‌లో పోస్ట్ చేశారు. ఈ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో రాఖీ సమయంలో నిమిషానికి 820 రాఖీలను విక్రయించినట్లు తెలిపారు. గత ఏడాది కంటే 2.5 రెట్ల వృద్ధి నమోదైనట్లు పేర్కొన్నారు.

# జన్‌ధన్ ఖాతాల రీ-కేవైసీకి డెడ్‌లైన్.. ఆన్‌లైన్‌లో చేసుకోండిలా

**జన్‌ధన్ యోజన పథకాన్ని ప్రారంభించి పదేళ్లు పూర్తయిందని, పెద్ద సంఖ్యలో ఖాతాలకు రీ-కేవైసీ చేయాల్సి ఉందని తాజాగా ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. రీకేవైసీకి సెప్టెంబర్ 30 వరకు గడువు ఉందన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వరంగ బ్యాంకులు పంచాయతీ స్థాయిలో రీ-కేవైసీ క్యాంపులు నిర్వహిస్తున్నాయని, వీటిని వినియోగించుకోవాలని సూచించారు. ఈ క్యాంపుల్లో రీ-కేవైసీతో పాటు మైక్రో ఇన్సూరెన్స్, పెన్షన్ పథకాలపై కూడా దృష్టి సారిస్తారని తెలిపారు. ఇంతకీ రీకేవైసీ అంటే ఏమిటి? ఆన్‌లైన్‌లో చేసుకునే వీలుందా?**

**రీ-కేవైసీ అంటే ఏమిటి?**

రీకేవైసీ అనేది ఖాతాదారుల వ్యక్తిగత వివరాలు, చిరునామా తదితరాలను నవీకరించే ప్రక్రియ. మీ కేవైసీ గడువు తేదీ ముగిసినా లేదా మీకు సంబంధించిన వివరాలు మారినా.. నిబంధనల ప్రకారం బ్యాంక్‌కు తాజా సమాచారం సమర్పించాల్సి ఉంటుంది. జన్‌ధన్ ఖాతాలు తెరిచి 10 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఇప్పుడు రీకేవైసీ ప్రక్రియ చేపడుతున్నారు. ఆయా క్యాంపుల్లో ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ రీకైవైసీ పూర్తి చేయొచ్చు.

**ఎస్‌బీఐలో ఇలా..**

ప్రభుత్వరంగ బ్యాంక్ అయిన ఎస్‌బీఐలోనే పెద్ద సంఖ్యలో జన్‌ధన్ ఖాతాలు ఉన్నాయి. ఒకవేళ ఈ బ్యాంక్‌లో జన్‌ధన్ ఖాతా ఉంటే ఆన్‌లైన్‌లోనూ రీకేవైసీ చేసుకునే వెసులుబాటు ఉంది. ఇందుకోసం తొలుత ఎస్‌బీఐ నెట్ బ్యాంకింగ్‌లో లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. అక్కడ' పై క్లిక్ చేసి అప్‌డేట్ కేవైసీని సెలెక్ట్ చేయండి. తర్వాత మీ ప్రొఫైల్ పాస్‌వర్డ్ ఎంటర్ చేసి సబ్మిట్ నొక్కండి. మెనూ నుంచి మీ ఖాతా ఎంచుకుని సబ్మిట్ చేయండి. అక్కడ మీ వివరాలు నమోదు చేసి, ఒకవేళ మీరేమైనా డాక్యుమెంట్స్ అప్‌డేట్ చేయాల్సివుంటే వాటిని కూడా అప్‌లోడ్ చేయండి. తర్వాత ఓటీపీ ఎంటర్ చేయడంతో మీ కేవైసీ పూర్తవుతుంది. మీరు ఇంతకుముందు సమర్పించిన పత్రాలకు, అప్‌డేట్ చేసిన డాక్యుమెంట్స్‌కు వ్యత్యాసం ఉంటే బ్యాంకును సంప్రదించండి. ఇతర బ్యాంకుల్లోనూ ఇదే తరహా ప్రక్రియ ఉంటుంది.

**ఏమిటీ జన్‌ధన్ ఖాతాలు?**

2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుపేద భారతీయులకు సైతం బ్యాంకు ఖాతా సౌకర్యం కల్పించడానికి ప్రధానమంత్రి జన్‌ధన్ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో ప్రతి కుటుంబానికి ఒక్క బ్యాంకు ఖాతా అయినా ఉండేటట్లు చూడడం జన్‌ధన్ పథకం ప్రధాన లక్ష్యం. ఈ ఖాతాల వల్ల ప్రజలు భద్రంగా డబ్బు పొదుపు చేసుకోవడం, బ్యాంకు రుణాలు పొందడం సులువు అవుతుంది. జన్‌ధన్ ఖాతాలను కనీస మొత్తం డిపాజిట్ లేకుండానే నిర్వహించుకోవచ్చు. చెక్కు సౌకర్యం కావాలంటే మాత్రం ఖాతాలో కనీస బ్యాలన్స్ తప్పనిసరి.



# 'ప్రతి రోజు చెబుతా'.. ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసిన జాన్వీకపూర్!



బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ ప్రస్తుతం లవ్ అండ్ రొమాంటిక్ కామెడీ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన కనిపించనుంది. ఈ సినిమాకు తుషార్ జలోటా దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలన ట్రైలర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగస్టు 29న థియేటర్లలో సందడి చేయనుంది.

ఇక సినిమా సంగతి పక్కన పెడితే జాన్వీ కపూర్ తాజాగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు హాజరైంది. ఈ సందర్భంగా ఉట్టికొట్టే సమయంలో భారత్ మాతా కీ జై అంటూ నినాదం చేసింది. దీంతో ఆమెపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున ట్రోలింగ్ మొదలైంది. ఇదేమీ ఇండిపెండెన్స్ డే కాదంటూ జాన్వీని ట్రోల్ చేశారు.

తాజాగా తనపై వస్తున్న ట్రోల్స్‌కు జాన్వీ కపూర్ స్పందించింది. ఈ మేరకు తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. అక్కడ ఉన్నవారంతా నాకంటే ముందు భారత్ మాతాకీ జై అని అన్నారని తెలిపింది. ఆ తర్వాత నేను కూడా చెప్పానని.. వారి వీడియోను కట్ చేసి నా మాటలను మాత్రమే వైరల్ చేస్తున్నారని ట్రోలర్స్‌కు కౌంటరిచ్చింది.

నా దేశాన్ని పొగిడేందుకు ప్రత్యేకంగా రోజంటూ లేదని రాసుకొచ్చింది. శ్రీ కృష్ణా జన్మాష్టమి నాడు మాత్రమే కాదు.. ప్రతిరోజూ భారత్ మాతాకీ జై అని చెబుతా అని ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ పెట్టింది. అంతేకాకుండా ఈ ఈవెంట్‌లో మరాఠీలో మాట్లాడిన జాన్వీ కపూర్ అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ చిత్రంలో కేరళ అమ్మాయిగా జాన్వీ కనిపించనుంది. ఢిల్లీ అబ్బాయితో ప్రేమలో పడిన మలయాళీ అమ్మాయి కథగా పరమ్ సుందరిని తెరకెక్కించారు.. ఈ చిత్రంలో రాజీవ్ ఖండేల్వాల్, ఆకాష్ దహియా కూడా కీలక పాత్రలు పోషించారు.

# గుంటూరు కారం చేసేప్పుడు నీ ఫేస్ కొంచెం తేడా



**ఈ మధ్య కాలంలో తెలుగులో మంచి క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్ అనగానే గుర్తొచ్చే పేరు శ్రీలీల. యాక్టింగ్ పరంగా ఈమెకు ఓ మాదిరి మార్కులు పడతాయి గానీ డ్యాన్సుల్లో మాత్రం ఇరగదీసేస్తోంది. కొన్నిరోజుల క్రితం తెగ హల్‌చల్ చేసిన 'వైరల్ వయ్యారి' పాటలోనూ శ్రీలీల మాస్ స్టెప్పులతో ఊపుఊపేసిందని చెప్పొచ్చు. అలాంటి ఈమె.. సీనియర్ నటుడు జగపతిబాబు హోస్ట్ చేస్తున్న టాక్ షోలో పాల్గొంది. ఆసక్తికర సంగతుల్ని కొన్ని బయటపెట్టింది. ఇందుకు సంబంధించిన ప్రోమో తాజాగానే రిలీజైంది.**

'జయమ్ము నిశ్చయమ్మురా' పేరుతో జగపతిబాబు హోస్ట్ చేస్తున్న ఈ షో.. గత వారమే లాంచ్ అయింది. తొలి ఎపిసోడ్ గెస్ట్‌గా హీరో నాగార్జున వచ్చారు. తన వ్యక్తిగత విషయాలు బోలెడన్ని పంచుకున్నారు. ఇప్పుడు రెండో ఎపిసోడ్ కోసం యంగ్ సెన్సేషన్ శ్రీలీలని తీసుకొచ్చారు. ఆ ప్రోమోనే ఇప్పుడు విడుదల చేశారు.

శ్రీలీలని షోకి ఆహ్వానించిన జగపతిబాబు.. 'మేమందరం ఇండస్ట్రీకి వచ్చి యాక్టింగ్ నేర్చుకున్నాం. నువ్వు యాక్టింగ్ నేర్చుకుని ఇండస్ట్రీకి వచ్చావ్' అని అన్నారు. దీంతో గతుక్కుమన్న శ్రీలీల.. సార్ తిట్టారా పొడిగారా అంటూ అమాయకంగా ఫేస్ పెట్టింది. 'గుంటూరు కారం' చేసేటప్పుడు లెఫ్ట్‌లోనో రైట్‌లోనో నీ ఫేస్ కొంచెం తేడా ఉండేది అని జగపతిబాబు అనగా.. 'ఆ టాపిక్ తీస్తే నేను మీ టాపిక్ తీసుకొస్తా సర్' అని శ్రీలీల చెప్పింది. 'మీ హీరోయిన్ గారు.. మీరు..' అంటూ వేలు చూపిస్తూ నవ్వేసింది.

'ఫస్ట్ సినిమాతోనే బ్లాక్ బస్టర్ కొట్టేశావ్' అని శ్రీలీలని ఉద్దేశించి జగపతిబాబు అనగానే.. 'దూల తీరిపోతుంది సార్' అంటూ శ్రీలీల తన బాధని నవ్వుతూనే బయటపెట్టింది. 'నీ మీద ఓ కంప్లైంట్ ఉందమ్మా' అంటూ జగ్గూ భాయ్ అనగానే.. శ్రీలీల తల్లి వెనక నుంచి ఈమెని సర్‌ప్రైజ్ చేసింది. 'మా అమ్మ మీకు పెద్ద ఫ్యాన్ సార్' అని శ్రీలీల చెప్పగానే.. జగపతిబాబు అలా చూశాడు. శ్రీలీల ముసిముసిగా నవ్వింది. దీంతో 'నువ్వెందుకు అంతగా సిగ్గు పడుతున్నావ్' అని జగపతిబాబు అనేసరికి అందరూ నవ్వేశారు. ఈ శుక్రవారం ఓటీటీలో ఫుల్ ఎపిసోడ్ ప్రసారం కానుంది.

# దివంగత నటుడు కోట శ్రీనివాసరావు ఇంట మరో విషాదం



**హైదరాబాద్:** దివంగత నటుడు కోట శ్రీనివాసరావు ఇంట విషాదం నెలకొంది. ఆయన భార్య రుక్మిణికన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం (ఆగస్టు 18న) తుదిశ్వాస విడిచారు. కాగా కోట శ్రీనివాసరావు నెల రోజుల క్రితమే పరమపదించారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో జూలై 13న కన్నుమూశారు. ఆయన మరణించిన నెల రోజులకే భార్య మరణించడం విషాదకరం! కోట రుక్మిణి మృతిపై పలువురు సెలబ్రిటీలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

**విలక్షణ నటుడు**

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా కోట శ్రీనివాసరావు తనదైన ముద్ర వేశారు. విలన్‌గా, తండ్రిగా, కామెడీ విలన్‌గా, రాజకీయ నాయకుడిగా విభిన్న పాత్రలో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. 1978లో ప్రాణం ఖరీదు సినిమాతో రంగప్రవేశం చేసిన కోట.. అన్నిరకాల పాత్రలు పోషించి తెలుగు తెరపై ఆల్‌రౌండర్‌గా నిలిచారు.

# రూ.200 కోట్లు కాదు జీరో పారితోషికం.. ఎందుకు?



**తమిళ స్టార్ హీరోల్లో అజిత్ ఒకడు. దళపతి విజయ్, రజినీకాంత్, సూర్య లాంటి వాళ్లతో పోలిస్తే ఇతడి మార్కెట్ చాలావరకు తమిళానికే పరిమితం. అయినా సరే వరస సినిమాలు చేస్తూ అభిమానుల్ని, ప్రేక్షకుల్ని అలరిస్తుంటాడు. ఈ ఏడాది ఇప్పటికే అజిత్ నటించిన రెండు చిత్రాలు రిలీజ్ కాగా.. అవి రెండు బాక్సాఫీస్ దగ్గర పర్వాలేదనిపించాయి. ఇప్పుడు ఓ కొత్త మూవీని మొదలుపెట్టేందుకు సిద్ధమవుతున్నాడు. కానీ ఓ ఆసక్తికర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.**

తనతో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' లాంటి క్రేజీ సినిమా తీసిన దర్శకుడు అధిక్ రవిచంద్రన్‌తోనే.. అజిత్ తన కొత్త మూవీ చేయబోతున్నాడు. త్వరలో షూటింగ్ మొదలు కానుంది. ఇందులో 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్ అని అంటున్నారు.

అయితే ఈ సినిమా కోసం తొలుత ఓ నిర్మాణ సంస్థ ముందుకు రాగా.. అజిత్ రూ.200 కోట్ల వరకు పారితోషికం డిమాండ్ చేశారని టాక్. దీంతో సదరు సంస్థ స్వచ్ఛందంగా తప్పుకొందని తెలుస్తోంది.

ఈ క్రమంలోనే అజిత్ నటించిన పలు సినిమాల్ని డిస్ట్రిబ్యూట్ చేసిన రాహుల్ అనే వ్యక్తి.. ఈ మూవీని నిర్మించేందుకు ముందుకు వచ్చాడని సమాచారం. అయితే రెమ్యునరేషన్ ఇవ్వకుండా ఓ డీల్ మాట్లాడుకున్నాడని తెలుస్తోంది. రెగ్యులర్‌గా ఇచ్చే పారితోషికం బదులు ఓటీటీ, శాటిలైట్ హక్కుల్ని హీరో అజిత్ తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారని టాక్. ఇవన్నీ కూడా రీసెంట్‌గా ఫైనల్ అయ్యాయని.. 'AK64' పేరుతో మొదలయ్యే ఈ ప్రాజెక్ట్‌ని త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

# వరకట్న వేధింపుల వ్యవహారం.. హీరోపై కేసు నమోదు



**తెలుగులో రెండు సినిమాల్లో హీరోగా నటించిన ధర్మ మహేశ్‌పై పోలీస్ కేసు నమోదైంది. అదనపు కట్నం కోసం తనని వేధిస్తున్నాడని ఇతడి భార్యనే గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఇప్పుడు ఈ విషయం కాస్త ఇండస్ట్రీలో కాస్త చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ అసలేమైంది?**

**సింధూరం, డ్రింకర్ సాయి సినిమాల్లో హీరోగా నటించిన ధర్మ మహేశ్.. 2019లో గౌతమి అనే మహిళని పెళ్లి చేసుకున్నాడు. వీళ్లకు ఓ బాబు కూడా ఉన్నాడు. గతంలో ఓసారి ఇతడిపై వరకట్న వేధింపుల ఆరోపణలు రావడంతో.. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించినట్లు తెలుస్తోంది. ఇప్పుడు మరోసారి భార్యని ఇదే విషయమై వేధింపులకు గురిచేస్తుండటంతో వ్యవహారం కేసుల వరకు వెళ్లింది.**

**సినిమా ఛాన్సులు పెరగడంతో తన భర్త జల్సాలకు అలవాటు పడ్డాడని, ఈ క్రమంలోనే అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఇతడి భార్య.. భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులపైన ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఒకటి రెండు చిత్రాలతో కాస్తోకూస్తో గుర్తింపు తెచ్చుకుంటున్న క్రమంలో ఇలా పోలీసు కేసుల వరకు వెళ్లడం హాట్ టాపిక్‌గా మారింది.**

# హీరో ఇంట్లో సీమంతం వేడుక.. 'బలగం' బ్యూటీ విషెస్

**మరో తెలుగు హీరో తండ్రి కాబోతున్నాడు. అయితే అతడు ఈ విషయాన్ని బయటపెట్టలేదు. 'బలగం' ఫేమ్ కావ్య కల్యాణ్ రామ్.. ఈ శుభకార్యానికి వెళ్లింది. కాబోయే తల్లిదండ్రులకు విషెస్ చెబుతూ పోస్ట్ పెట్టింది. అలా ఈ గుడ్ న్యూస్ అందరికీ తెలిసింది. దీంతో సదరు హీరోకి నెటిజన్లు శుభాకాంక్షలు చెబుతున్నారు.**





తెలుగు సినిమాల్లో హీరోగా, సహాయ పాత్రలు చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న నటుడు తిరువీర్. తెలంగాణకు చెందిన ఈ కుర్రాడు.. 'మసూద' మూవీతో మంచి ఫేమ్ సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం ఒకటి రెండు చిత్రాల్లో హీరోగా చేస్తున్నాడు. 2016నుంచి ఇండస్ట్రీలో ఉన్న ఇతడు.. ఘాజీ, మల్లేశం, జార్జ్ రెడ్డి, పలాస, టక్ జగదీష్, మసూద, పరేషాన్, మోక్షపటం సినిమాలు చేశాడు. పర్లేదనిపించేలా గుర్తింపు తెచ్చుకున్నాడు.

వ్యక్తిగత విషయానికొస్తే గతేడాది కల్పన అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో సొంతూరిలో కొత్త ఇంట్లోకి అడుగుపెట్టాడు. 'రెండు దశాబ్దాల కల, అమ్మ చివరి కోరిక' అని తన ఇంటి ఫొటోలని కూడా షేర్ చేశాడు. ఇప్పుడు తిరువీర్ భార్య కల్పన ప్రెగ్నెన్సీతో ఉంది. సోమవారం నాడు సీమంతం వేడుక చేశారు. ఈ ఫొటోలని కావ్య కల్యాణ్ రామ్ షేర్ చేసింది. అలా తిరువీర్ తండ్రి కాబోతున్న విషయం అందరికీ తెలిసింది.

# 'కానిస్టేబుల్ కనకం'.. 4రోజుల్లోనే రికార్డు వ్యూస్

**వర్ష బొల్లమ్మ కీలక పాత్రలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ 'కానిస్టేబుల్ కనకం'. ప్రశాంత్ కుమార్ దర్శకుడు. ఈటీవీ విన్ ఒరిజినల్ సిరీస్‌గా గత వారం స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ సిరీస్ ఓటీటీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇప్పటికే వెబ్‌సిరీస్ 100+మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటి మరింత మందికి చేరువ అవుతోందని తెలుపుతూ ఈటీవీ విన్ సరికొత్త పోస్టర్‌ను పంచుకుంది. వైవిధ్యమైన కథ, కథనాలతో పాటు, ప్రతి ఎపిసోడ్ అలరించేలా తీర్చిదిద్దారు దర్శకుడు ప్రశాంత్. ముఖ్యంగా చివరి ఎపిసోడ్‌లో వచ్చే ట్విస్ట్‌లు అందరినీ అలరిస్తున్నాయి.**



'కానిస్టేబుల్ కనకం' సిరీస్‌కు కొనసాగింపు ఉంటుందని చివరిలో చూపించారు. కనిపించకుండాపోయిన చంద్రిక ఏమైంది? అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రశ్నలు సంధిస్తున్నారు. వాటికి సమాధానం తెలియాలంటే సీజన్2 కోసం వేచి చూడాల్సిందే. అసభ్య సన్నివేశాలు, సంభాషణలకు తావులేకుండా కుటుంబంతో కలిసి చూసేలా సిరీస్‌ను తీర్చిదిద్దడంతో ఇది కుటుంబ ప్రేక్షకులకు మరింత చేరువవుతోంది. అంతేకాదు, ఫస్ట్ ఎపిసోడ్‌ను ఉచితంగా చూసే వెసులుబాటును ఈటీవీ విన్ కల్పిస్తోంది.

**ఇంతకీ కథేంటంటే..**

శ్రీకాకుళం జిల్లాలోని రేపల్లె గ్రామ సమీపంలోని అడవిగుట్ట వైపు ఎవరు వెళ్లినా కనిపించకుండా పోతారు. ముఖ్యంగా మహిళలు అటువైపు వెళ్లడానికి వీల్లేదని ఊరి ప్రెసిడెంట్ (అవసరాల శ్రీనివాస్) ఆదేశాలు జారీ చేస్తాడు. పొరపాటున అటువైపు వెళ్లిన ముగ్గురు మహిళల ఆచూకీ లభ్యం కాదు. అదే గ్రామానికి మహిళా కానిస్టేబుల్‌గా వస్తుంది కనక మహాలక్ష్మి అలియాస్ కనకం (వర్ష బొల్లమ్మ). ఆ ఊరికి వస్తున్న సమయంలో పరిచయమైన చంద్రిక (మేఘ లేఖ) స్నేహితురాలై, ఆమెతో విడదీయరాని అనుబంధం ఏర్పడుతుంది. ఒకరోజు కనకం, చంద్రిక కలిసి బండిపై వెళ్తుండగా ప్రమాదం జరుగుతుంది. ఆ తర్వాత నుంచి చంద్రిక కన్పించకుండాపోతుంది. ఇంతకీ చంద్రిక ఏమైంది? అడవిగుట్టలో దాగిన మర్మం ఏంటి? అక్కడికి వెళ్లిన మహిళలు ఏమవుతున్నారు? కానిస్టేబుల్ కనకం ఈ మిస్టరీని ఎలా ఛేదించింది? అన్నది సిరీస్.

## బుమ్రా.. ఫిజియోల సూచనలు పాటించాలి: టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్



వర్క్‌లోడ్ నేపథ్యంలో జస్‌ప్రీత్ బుమ్రా .. ఇంగ్లాండ్ టూర్‌లో కేవలం మూడు మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. ఈ విషయంలో అతడు పలు విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే అతడికి టీమ్‌ఇండియా మాజీ ఫాస్ట్ బౌలర్ చేతన్ శర్మ మద్దతుగా నిలిచాడు. బౌలర్లు తమ ఫిజియోలు చెప్పింది కచ్చితంగా పాటించాలన్నాడు. 'ఒక వేళ డాక్టర్ నన్ను యాంటీబయోటిక్స్ వాడమంటే.. నేను కచ్చితంగా వాడతాను. అలాగే ఫిజియోలు.. ఆటగాడికి వర్క్‌లోడ్ గురించి చెబితే.. వారి సూచనల్ని తప్పనిసరిగా పాటించాలి. ఎందుకంటే సమస్య గురించి వారికే ఎక్కువగా అవగాహన ఉంటుంది' అని చేతన్ శర్మ మీడియాతో అన్నాడు.

ఇంగ్లాండ్‌లో టీమ్‌ఇండియా ప్రదర్శన అద్భుతంగా ఉందని అతడు కితాబిచ్చాడు. అలాగే ఆసియా కప్‌లోనూ టీమ్‌ఇండియా సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. 'జట్టుకు ఎంపికైన వారు అత్యుత్తమమైన వారని నాకు తెలుసు. ఇంగ్లాండ్‌లో టీమ్‌ఇండియా అద్భుతంగా ఆడింది. అలాగే భారత జట్టు ఆసియా కప్‌లో విజయం సాధిస్తుందని నాకు చాలా నమ్మకంగా ఉంది. 2026లో జరగనున్న టీ20 ప్రపంచకప్‌లోనూ భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తుంది' అని చేతన్ శర్మ విశ్లేషించాడు.
తెందూల్కర్ అండర్సన్ టోర్నీలో భాగంగా ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో తలపడింది. ఒకటి, మూడో మ్యాచుల్లో ఇంగ్లాండ్ జట్టు గెలిస్తే.. రెండు, అయిదో మ్యాచుల్లో భారత జట్టు విజయం సాధించింది. నాలుగో టెస్ట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో ఈ సిరీస్ 22తో సమమైంది. రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ.. సుదీర్ఘ ఫార్మాట్‌కు ఒకరి తర్వాత మరొకరు వీడ్కోలు పలకడంతో శుభ్‌మన్ గిల్ తొలిసారిగా ఈ సిరీస్‌లోనే భారత జట్టు టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాడు.

ఆసియా కప్ సెప్టెంబర్ 9 నుంచి యూఏఈ వేదికగా జరగనుంది. మొదటి మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్, హాంకాంగ్ తలపడనున్నాయి. సెప్టెంబర్ 10న టీమ్‌ఇండియా, యూఏఈ మధ్య మ్యాచ్ జరగనుంది. ఆసియా కప్‌లో పాల్గొనబోయే భారత జట్టును ఆగస్టు 19న (మంగళవారం) బీసీసీఐ ప్రకటించే అవకాశముంది.





## గుకేశ్‌పైనే దృష్టి

**నేటి నుంచి సింక్‌ఫీల్డ్ కప్ చెస్ టోర్నీ బరిలో ప్రజ్ఞానంద**

**సెయింట్ లూయిస్ (అమెరికా):** ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మ రాజు గుకేశ్ తిరిగి క్లాసికల్ చెస్ పోటీల్లో తలపడేందుకు సిద్ధమయ్యాడు. గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా ఐదో టోర్నీ అయిన సింక్‌ఫీల్డ్ కప్‌లో భారత్ తరఫున గుకేశ్‌తోపాటు ప్రజ్ఞానంద విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. పదిమంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతుంది. సోమవారం నుంచి ఇక్కడ జరిగే ఈ టోర్నీలో అమెరికా గ్రాండ్‌మాస్టర్లు ఫాబియానో కరువానా, వెస్లీ సో, లెవోన్ అరోనియన్, స్యామ్ సేవియన్‌లతో పాటు ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమి వాచియెర్ లాగ్రెవ్, అలీరెజా ఫిరూజా... పోలాండ్ స్టార్ జాన్ క్రిస్టోఫ్ డూడా... ఉజ్బెకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ నొదిర్బెక్ అబ్దుసత్తోరోవ్ కూడా పాల్గొంటున్నారు.
అయితే ప్రపంచ నంబర్‌వన్, మాజీ ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ ఆడకపోవడమే టోర్నీకి ప్రధాన లోటు అని చెప్పొచ్చు. ఈ నార్వే గ్రాండ్‌మాస్టర్ క్లాసికల్ చెస్‌ను ఆస్వాదించలేకపోతున్నానని ఇదివరకే ఎన్నో సార్లు స్పష్టం చేశాడు. అందువల్లే ఈ టోర్నీకి దూరంగా ఉన్నాడు. అయితే చెస్ దిగ్గజం కార్ల్‌సన్ లేకపోయినప్పటికీ భారత ఆటగాళ్లకు ప్రధానంగా అమెరికా ఆటగాళ్లు ఆరోనియన్, కరువానా, అలీరెజా నుంచి గట్టిపోటీ తప్పదు. సెయింట్ లూయిస్‌లోనే జరిగిన గ్రాండ్ చెస్ టూర్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో గుకేశ్ ఆశించినంతగా రాణించలేకపోయాడు.
అయితే తనకు పట్టున్న క్లాసికల్ ఫార్మాట్‌లో సత్తా చాటుకోవడానికి గుకేశ్ రెడీగా ఉన్నాడు. ఈ టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ 3,50,000 డాలర్లు (రూ. 3 కోట్ల 6 లక్షలు). విజేతకు 1,00,000 డాలర్లు (రూ.87 లక్షల 51 వేలు) అందజేస్తారు. రన్నరప్‌గా నిలిచిన ప్లేయర్‌కు 65 వేల డాలర్లు (రూ. 56 లక్షల 88 వేలు), మూడో స్థానం పొందిన ప్లేయర్‌కు 48 వేల డాలర్లు (రూ. 42 లక్షలు) లభిస్తాయి.



## ఆస్ట్రేలియా టీ20 టోర్నీ.. పాక్ ఆటగాడి మెరుపు శతకం

ఆస్ట్రేలియాలో జరుగుతున్న టాప్ ఎండ్ టీ20 టోర్నీలో పాకిస్తాన్ షాహీన్స్ ఆటగాడు అబ్దుల్ సమద్ మెరుపు సెంచరీతో చెలరేగాడు. మెల్‌బోర్న్ రెనెగేడ్స్ అకాడమీతో ఇవాళ (ఆగస్ట్ 18) జరిగిన మ్యాచ్‌లో 63 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్ల సాయంతో అజేయమైన 110 పరుగులు చేశాడు.
ఫలితంగా తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. పాక్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు యాసిర్ ఖాన్, ఖ్వాజా నఫే డకౌట్లు కాగా.. అబ్దుల్ సమద్ ఒంటిచేత్తో ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. అతనికి మొహమ్మద్ ఫైక్ (23), కెప్టెన్ ఇర్ఫాన్ ఖాన్ (21) సహకరించారు. మెల్‌బోర్న్ బౌలర్లలో ఫెర్గస్ ఓనీల్, సదర్‌ల్యాండ్, మైఖేల్ ఆర్చర్, కల్లమ్ స్టో, ఒలివర్ పీక్ తలో వికెట్ తీశారు.
అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనకు దిగిన మెల్‌బోర్న్.. మాజ్ సదాకత్ (40223), ఫసల్ అక్రమ్ (40192) ధాటికి 19.2 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. తద్వారా పాక్ షాహీన్స్ 73 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మెల్‌బోర్న్ ఇన్నింగ్స్‌లో జోష్ బ్రౌన్ (36) మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు.

కాగా, 11 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో ఆస్ట్రేలియా లోకల్ జట్లతో పాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్‌కు చెందిన జట్లు పోటీపడుతున్నాయి. ఈ టోర్నీలో పాక్‌కు చెందిన షాహీన్స్ జట్టు 3 మ్యాచ్‌ల్లో 2 విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతుంది. నార్తర్న్ టెరిటరీ స్ట్రయిక్ అనే జట్టు ఆడిన 3 మ్యాచ్‌ల్లో 3 విజయాలు సాధించి అగ్రస్థానంలో ఉంది.

# 17 ఏళ్ల కెరీర్.. విరాట్ సాధించిన భారీ రికార్డులు ఇవే..!




**టీమిండియా స్టార్ ఆటగాడు, దిగ్గజ బ్యాటర్ విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్‌లో ఇవాల్టితో (ఆగస్ట్ 18) 17 ఏళ్లు పూర్తి చేసుకున్నాడు. 2008లో ఇదే రోజున విరాట్ వన్డేల ద్వారా టీమిండియా అరంగేట్రం చేశాడు. నాటి నుంచి విరాట్ ఏం చేశాడో ప్రపంచమంతా చూసింది.**

17 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో సెంచరీల మీద సెంచరీలు కొడుతూ, పరుగుల వరద పారిస్తున్న విరాట్.. ఎన్నో రికార్డులు బద్దలు కొట్టాడు. మరెన్నో కొత్త రికార్డులు నెలకొల్పాడు. ఈ సుదీర్ఘ అంతర్జాతీయ కెరీర్‌లో విరాట్ సాధించిన భారీ రికార్డులపై ఓ లుక్కేద్దాం.

అన్ని ఫార్మాట్లలో 550 మ్యాచ్‌లు ఆడిన విరాట్... 52.27 సగటున 82 సెంచరీలు, 143 హాఫ్ సెంచరీల సాయంతో 27599 పరుగులు చేశాడు.
అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ (34357), సంగక్కర (28016) తర్వాత మూడో స్థానం
**సచిన్ (100) తర్వాత అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాడు**
**ఒకే దశకంలో 20000 పైచిలుకు పరుగులు చేసిన తొలి ఆటగాడు**
**సచిన్ (76) తర్వాత అత్యధిక మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు (69) అందుకున్న ఆటగాడు**
**అత్యధిక మ్యాన్ ఆఫ్ ద సిరీస్ అవార్డులు (21) అందుకున్న ఆటగాడు**
**అత్యధిక ఐసీసీ అవార్డులు (10) అందుకున్న ఆటగాడు**
**వన్డేల్లో అత్యధిక సెంచరీలు (51) చేసిన ఆటగాడు**
**వన్డేల్లో అత్యంత వేగంగా 8000-14000 పరుగులు చేసిన ఆటగాడు**
**వన్డే ఛేదనల్లో అత్యధిక సెంచరీలు (24) చేసిన ఆటగాడు**
**వన్డేల్లో ఓ జట్టుపై (శ్రీలంక) అత్యధిక సెంచరీలు (10)**
**వన్డేల్లో మూడు దేశాలపై (శ్రీలంక, వెస్టిండీస్, ఆస్ట్రేలియా) 8కి పైగా సెంచరీలు చేసిన ఏకైక ఆటగాడు**
**టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు (39)**
**టీ20ల్లో అత్యధిక సగటు (48.70) కలిగిన ఆటగాడు**
**టీ20ల్లో అత్యధిక హాఫ్ సెంచరీలు (39)**
**ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మూడు ఫార్మాట్లలో నంబర్ వన్‌గా నిలిచిన ఏకైక భారత ఆటగాడు**
**కెప్టెన్‌గా అత్యధిక (7) డబుల్ సెంచరీలు చేసిన ఆటగాడు**
**అత్యంత వేగంగా 25 టెస్ట్ సెంచరీలు చేసిన భారత ఆటగాడు**
భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన సారథి (68 మ్యాచ్‌ల్లో 40 విజయాలు)
గతేడాది టీ20 ఫార్మాట్‌కు.. ఈ ఏడాది టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్, ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు.

# గావస్కర్‌కు ఆటే ముఖ్యం.. ప్రధాని వచ్చినా కలవలేదు: మాజీ క్రికెటర్

**ఇంటర్నెట్ డెస్క్: ప్రధానమంత్రి కలిసేందుకు వచ్చారంటే ఎవరైనా ఎగిరి గంతేస్తారు. కానీ, ఆ దిగ్గజ క్రికెటర్ మాత్రం 'ఆట'కే ప్రాధాన్యమిస్తూ వ్యవహరించిన తీరు ఏకంగా ప్రధానినే ఆకట్టుకుంది. చివరికి ఆయన కోసం ప్రధానే డ్రెస్సింగ్‌రూమ్‌కు వెళ్లడం గమనార్హం. ఇప్పటికే పై ఫొటోను చూస్తే అర్థమై ఉంటుందిగా.. ఆ లెజెండరీ క్రికెటర్ మరెవరో కాదు సునీల్ గావస్కర్. భారత క్రికెట్‌లో ఎందరో స్టార్లకు ఆయనే మార్గదర్శి. రికార్డులకు పునాది వేసిందీ ఆయనే. 1990ల క్రికెటర్లకూ ఆదర్శంగా నిలిచిన సునీల్ గావస్కర్ టెస్టుల్లో తొలిసారి 10వేల పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా ఘనత సాధించాడు. విండీస్‌తోపాటు ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాకు చెందిన భీకర పేస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. అయితే, 1975 వరల్డ్ కప్‌లో 174 బంతులు ఎదుర్కొని 36 పరుగులు చేయడం పైనా విమర్శలు వచ్చాయి. ఈవిషయాలపై అప్పటి సహచరుడు, మాజీ క్రికెటర్ కర్సాన్ ఘావ్రీ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు.**





**సూర్య.. నిలుస్తాడా?**
''భారత క్రికెటర్లుగా మాకు అప్పుడు వన్డేల్లో ఎలా ఆడాలనేది పెద్దగా తెలియదు. మేం ఆడిన తొలి వన్డే ప్రపంచకప్ మొదటి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 334 పరుగులు చేసింది. ఇక మేం బ్యాటింగ్ చేసే సమయం వచ్చింది. సునీల్ గావస్కర్ 60 ఓవర్లపాటు క్రీజ్‌లో ఉండిపోయాడు. మేమంతా డగౌట్ నుంచి అలా కాదు.. వేగం పెంచాలని చెప్పాం. లేకపోతే ఔట్ కావాలని సందేశం పంపించాం. కానీ, సునీల్ గావస్కర్ మాత్రం ఎవరి మాటా వినలేదు. టోనీ గ్రెగ్, జెఫ్ ఆర్నాల్డ్, క్రిస్ ఓల్డ్, బాబ్ విల్లీస్ వంటి బౌలర్లను ఆడేశాడు. ఆ మ్యాచ్ తర్వాత ఎందుకు తాను అలా నిదానంగా ఆడాడో వివరణ ఇచ్చాడు. ''భవిష్యత్తులో వారితో టెస్టు మ్యాచులు ఉంటాయి కదా.. అందుకోసం ప్రాక్టీస్ చేశా'' అని చెప్పాడు. దీంతో డ్రెస్సింగ్ రూమంతా గందరగోళంగా మారిపోయింది. కాసేపటికి తనను ఒంటరిగా వదిలేయమని కోరాడు'' అని ఆనాటి సంగతులను ఘావ్రీ గుర్తు చేసుకున్నాడు.

**డ్రెస్సింగ్ రూమ్‌లో అలా..**
సునీల్ గావస్కర్‌కు తన జట్టు, తన బ్యాటింగ్ ఎంత ముఖ్యమో చెప్పేందుకు ఘావ్రీ మరో ఉదాహరణను తెలిపారు. ''ఆస్ట్రేలియాతో టెస్టు మ్యాచ్. అందుకు ఫిరోజ్‌షా కోట్లా మైదానం వేదిక. అక్కడికి ప్రధాని మొరార్జీ దేశాయ్ వస్తారని మాకు సమాచారం వచ్చింది. మ్యాచ్‌కు ముందే ఆటగాళ్లను కలుస్తారనేది సందేశం సారాంశం. కానీ, ఆయన రావడం కాస్త ఆలస్యమైంది. అప్పటికే టాస్ వేశారు. తొలుత టీమ్‌ఇండియానే బ్యాటింగ్ చేయాలి. దీంతో సునీల్ గావస్కర్ ప్యాడ్లను కట్టుకొని సిద్ధంగా ఉన్నాడు. అప్పుడే డ్రెస్సింగ్ రూమ్‌లోకి రాజ్ సింగ్ దుంగార్పూర్ వచ్చారు. మరికొన్ని నిమిషాల్లో సునీల్ బ్యాటింగ్‌కు వెళ్లాల్సిఉంది. అప్పుడు రాజ్‌సింగ్ 'ప్రతిఒక్కరూ రండి. ప్రధాని ఇక్కడ ఉన్నారు. ఆయనతో పరిచయం చేసుకొని వచ్చేద్దాం. మూడు నిమిషాల్లో అయిపోతుంది' అని అన్నారు. సునీల్ మినహా.. మిగతావారు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. గావస్కర్ మాత్రం ' నేను రావడం లేదు. ఆటపై దృష్టిపెట్టాలి. నాకు నా బ్యాటింగ్ ముఖ్యం. అలాగే జట్టు ముఖ్యం' అని అన్నాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు వెళ్లిపోయాడు. టీ బ్రేక్ వరకూ ఆడాడు. అయితే, ఆ రోజు ఆట చివర్లో ప్రధాని మొరార్జీదేశాయ్ మా డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చారు. అదీనూ గావస్కర్‌ను మాత్రమే కలిసేందుకు కావడం మమ్మల్ని ఆశ్చర్యానికి గురి చేసింది. అందుకే, సునీల్ గావస్కర్ ఎప్పుడూ ఛాంపియనే. కామెంటేటర్‌గా పాతికేళ్ల నుంచి యువ క్రికెటర్లకు విలువైన సూచనలు ఇచ్చాడు. అలాంటి వ్యక్తిపట్ల రోహిత్ లేదా విరాట్ ఎవరైనా సరే గౌరవంగా ఉండాలి. అతడు చెప్పే మాటలు చాలా విలువైనవి. వారి మంచి కోసమే అలా మాట్లాడతాడు'' అని ఘావ్రీ వెల్లడించాడు.

# టీమిండియా యువ బౌలర్ విధ్వంసం

**19 బంతుల్లో హాఫ్ సెంచరీ, 3 వికెట్లు**

యూపీ టీ20 లీగ్‌లో టీమిండియా యువ బౌలర్, కేకేఆర్ మాజీ మీడియం పేసర్ శివమ్ మావి విధ్వంసం సృష్టించాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి మెరుపులు మెరిపించాడు. ఈ లీగ్‌లో కాశీ రుద్రాస్‌కు ఆడుతున్న మావి.. గోరఖ్‌పూర్ లయన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదాడు. ఇందులో 6 సిక్సర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం 21 బంతులు ఎదుర్కొన్న మావి 54 పరుగులు చేసి ఔటయ్యాడు.

ఎనిమిదో వికెట్‌కు మావి శివ సింగ్‌తో (17 బంతుల్లో 34 నాటౌట్; 4 సిక్సర్లు) కలిసి 87 పరుగులు జోడించాడు. మావి, శివ సింగ్ ఇన్నింగ్స్ చివర్లో సుడిగాలి ఇన్నింగ్స్‌లు ఆడటంతో రుద్రాస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఈ జట్టు తరఫున కెప్టెన్ కరణ్ శర్మ (39), యశోవర్ధన్ సింగ్ (23) కూడా ఓ మోస్తరు స్కోర్లు చేశారు. గోరఖ్‌పూర్ బౌలర్లలో అబ్దుల్ రెహ్మాన్ 3, శివమ్ శర్మ 2, ప్రిన్స్ యాదవ్, వాసు వట్స్, విజయ్ యాదవ్ తలో వికెట్ తీశాడు.



అనంతరం మావి బౌలింగ్‌లోనూ రాణించాడు. 3.1 ఓవర్లలో 24 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. మావి ఆల్‌రౌండ్ షోతో చెలరేగడంతో రుద్రాస్ గోరఖ్‌పూర్ జట్టుపై 50 పరుగుల తేడాతో గెలుపొందింది. మావితో పాటు అటల్ బిహారీ రాయ్ (40133), కార్తీక్ యాదవ్ (30142), సునీల్ కుమార్ (30251) కూడా సత్తా చాటడంతో గోరఖ్‌పూర్ జట్టు 19.1 ఓవర్లలో 126 పరుగులకే టపా కట్టేసింది. గోరఖ్‌పూర్ తరఫున ప్రిన్స్ యాదవ్ (29 బంతుల్లో 49; 4 ఫోర్లు, 4 సిక్సర్లు), కెప్టెన్ ఆకాశ్‌దీప్ నాథ్ (34) పోరాటం చేశారు. అయితే అప్పటికే ఆ జట్టు ఓటమి ఖరారైపోయింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఇరగదీసిన మావికి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

26 ఏళ్ల మావిని 2018 ఐపీఎల్ సీజన్‌లో కేకేఆర్ రూ. 3 కోట్ల రికార్డు ధర చెల్లించి సొంతం చేసుకుంది. మావి కేకేఆర్ తరఫున 32 మ్యాచ్‌లు ఆడి 30 వికెట్లు తీశాడు. అనంతరం 2024 సీజన్ మెగా వేలంలో మావిని లక్నో సూపర్ జెయింట్స్ ఊహించని ధర (రూ. 6.4 కోట్లు) వెచ్చించి కొనుగోలు చేసింది. అయితే ఆ సీజన్ ప్రారంభానికి ముందే అతను పక్కటెముకల గాయంతో వైదొలిగాడు.

ఐపీఎల్ ప్రదర్శనల కారణంగా మావికి 2023లో టీమిండియా నుంచి పిలుపు వచ్చింది. అరంగేట్రం టీ20లోనే అతను 4 వికెట్ల ప్రదర్శనతో చెలరేగి సత్తా చాటాడు. అయితే ఆతర్వాత మ్యాచ్‌ల్లో రాణించలేకపోవడంతో మావి అంతర్జాతీయ టీ20 కెరీర్‌కు 6 మ్యాచ్‌లతోనే బ్రేక్ పడింది.